అక్షర కలం తెలుగు దిన పత్రికలో పదవి విరమణ, కోర్టు నోటీసులు, జన్మదిన, వ్యాపార అభివృద్ధి కొరకు మరియు అన్ని రకాల ప్రకటనలు ప్రచురించబడును.
సంప్రదించండి 93962 18955
aksharakalam@gmail.com
అక్షరకలం తెలుగు దినపత్రిక

epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

అక్షరకలం తెలుగు దినపత్రిక
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న 'అక్షర కలం'తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు మండలాల వారిగా, నియోకవర్గాలవారిగా, జిల్లాల వారిగా విలేకరులు, యాడ్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
గమనిక : డిగ్రీ ఉత్తీర్ణులు మరియు వివిధ పత్రికలలో పని చేసిన అనుభవం ఉన్నవారికి ప్రాముఖ్యత కలదు
epaper.aksharakalam.com
aksharakalam@gmail.com
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 93962 18955

సంపుటి : 17 సంచిక : 250 | 22-10-2025 బుధవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ | పేజీలు : 12 వెల : రూ.1.00



## పోలీస్ అంటేనే ఒక
# నమ్మకం, భరోసా

పోలీస్ అంటేనే సమాజానికి ఒక నమ్మకం, భరోసా అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విధి నిర్వహణలో ఒక్కోసారి ప్రాణాలను సైతం పణంగా పెట్టాల్సి వచ్చినా పోలీస్ వెనుకడుగు వేయడని చెప్పారు. ఒకవైపు నెత్తురు చిందుతున్నా... మన రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీరులు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. హైదరాబాద్ గోషామహల్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పోలీస్ ఫ్లాగ్ డే పరేడ్ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.





- విధి నిర్వహణలోఎందరో పోలీసుల ప్రాణార్పణం
- అమరులను సంస్మరించుకోవడం మన విధి
- అమరుల కుటుంబానికి అన్ని విధాలుగా అండ
- కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి కోటి పరిహారం
- మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాల్సిందే
- ఈగిల్ టీమ్‌తో డ్రగ్స్ ముఠా అరికడుతున్నాం
- సైబర్ నేరాలపై పోలీసుల కృషి ప్రశంసనీయం
- పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భగా రేవంత్ నివాళి

వివరాలు 2లో





## జూబ్లీహిల్స్ ప్రచారం కోసం స్టార్ కాంపెయినర్లు

- 40 మంది పేర్లు విడుదల చేసిన పార్టీ
- జాబితాలో మాజీ సీఎం కెసిఆర్ పేరు

వార్త 2లో

## ఆపరేషన్ సిందూర్‌కు
# శ్రీరాముడే స్ఫూర్తి



- ఆయోధ్యలో రామాలయం తరువాత రెండో దీపావళి
- ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు.. మోడీ

పూర్తి 2లో

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలను ఉద్దేశిస్తూ.. ప్రధాని నరేంద్ర మోదీ ఓ లేఖ రాశారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. ఆపరేషన్ సిందూర్ కు శ్రీరాముడే స్ఫూర్తి అని పేర్కొన్నారు.

## గెలిచిన వారు ఏ పార్టీలో ఉన్నారో ?

- దానం నాగేందర్ స్టార్ కాంపెయినర్ ఎలా
- ఖైరతాబాద్ బస్తీ దవాఖానలను పరిశీలించిన కెటిఆర్
- ప్రభుత్వ వైద్యానికి సుస్తీ పట్టిందని విమర్శ

పూర్తి 2లో



పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేక పోతున్నారని.. వాళ్ళకి సిగ్గనిపించడం లేదా అని ప్రశ్నించారు. స్పీకర్ దగ్గర తాము పార్టీ మారలేదని అబద్దాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. దానం నాగేందర్ పేరు కాంగ్రెస్ పార్టీ క్యాంపెయినర్ల లిస్టులో ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు.

# తెలంగాణ రైజింగ్‌కు సలహాలు

### ఈనెల 25తో ముగియనున్న సర్వే

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

తెలంగాణా రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన 'తెలంగాణ రైజింగ్– 2047 ' సిటిజన్ సర్వే కు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు ఈ సిటిజన్ సర్వే లో కేవలం తెలంగాణ నుండే వివిధ ప్రాంతాల నుండి దాదాపు మూడు లక్షలకు పైగా పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందచేశారు. భారత దేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ – 2047 ' సిటిజన్ సర్వేను చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25 వతేదీ తో ముగుస్తుంది. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉన్నందున వెబ్‌సైట్ లో సందర్శించి ప్రతీ ఒక్కరు తమ సలహాలు సూచనలను అందించాల్సింగా ఒక అధికార ప్రకటనలో తెలియ చేశారు.

## ప్రమోద్ కుటుంబానికి
# అండగా ఉంటాం

- బాధితకుటుంబానికి డిజిపి పరామర్శ
- అంకితభావంతో పనిచేసే పోలీసును కోల్పోయాం
- రియాజ్ ఎన్‌కౌంటర్‌పై విచారణ
- ఆస్పత్రిలో గాయపడ్డ ఆసిఫ్‌కు పరామర్శ

6 లో..




## దక్షిణాఫ్రికాలో కామారెడ్డి వాసి అనుమానాస్పద మృతి

కామారెడ్డి, అక్షరకలం ప్రతినిధి

దీపావళి రోజు దక్షిణాఫ్రికాలో తెలంగాణ వాసి మృతిచెందాడు. కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌కు చెందిన బత్తుల శ్రీనివాస్ (32) అనుమానాస్పదస్థితిలో మరణించాడు. వివరాల్లోకి వెళ్తే.. భిక్కనూర్‌కు చెందిన బత్తుల శ్రీనివాస్ కొన్నేళ్ల క్రితం ఉపాధి కోసం దక్షిణాఫ్రికాకు వలస వెళ్లాడు. అక్కడ బోరింగ్ డ్రిల్లర్, డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే సోమవారం నాడు చెట్టుకు వేలాడుతూ విగతజీవిగా ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. దీంతో తెలంగాణలోని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. తమ కొడుకు మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు.



## బిజెపి అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి నామినేషన్

6 లో..

కిషన్ రెడ్డి, రామచంద్రరావుతో కలిసి వచ్చిన దీపక్ ముగిసిన నామినేషన్ల పర్వం

6 లో..



## బంగాళా ఖాతంలో అల్పపీడనం

తెలంగాణలో ఐదురోజులు మోస్తరు వర్షాలు

# ఆపరేషన్ సిందూర్‌కు శ్రీరాముడే స్ఫూర్తి

### ఆయోధ్యలో రామాలయం తరవాత రెండో దీపావళి

### ప్రజలకు దీపావళి శుభాక్షాంక్షలు... మోడీ

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలను ఉద్దేశిస్తూ.. ప్రధాని నరేంద్ర మోదీ ఓ లేఖ రాశారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. ఆపరేషన్ సిందూర్ కు శ్రీరాముడే స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు.. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకుందన్నారు. 'అయోధ్యలో రామాలయం నిర్మించిన తర్వాత ఇది రెండో దీపావళి. ధర్మాన్ని కాపాడాలని శ్రీరాముడు మనకు బోధించాడు. అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని ఇస్తాడు. కొన్ని నెలల క్రితం మనం చేపట్టిన ఆపరేషన్ సిందూరే దీనికి ఉదాహరణ. మనం భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నాం. ఈ దీపావళికి మరో ముఖ్యమైన ప్రత్యేకత ఉంది. మావోయిస్టుల నుంచి విముక్తి పొందిన అనేక జిల్లాలతో పాటు మారుమూల ప్రాంతాల్లో కూడా దీపావళి వెలుగులు నిండాయి. మన దేశ రాజ్యాంగంపై విశ్వాసంతో అనేకమంది హింసా మార్గాన్ని విడిచిపెట్టి.. జన జీవన స్రవంతిలోకి వచ్చిన అనేకమందిని మనం ఇటీవల చూశాం అని పేర్కొన్నారు. ఇది దేశానికి ఇది ఒక గొప్ప విజయం అని పేర్కొన్నారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ రేట్లను తగ్గించిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. ఈ జీఎస్టీ రేట్ల తగ్గింపు కారణంగా ప్రజలకు పెద్ద మొత్తంలో లబ్ధి చేకూరుతుందన్నారు. ఇక, పౌరులు స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని మోదీ పిలుపునిచ్చారు. అన్ని భాషలను గౌరవించాలన్నారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. మనం తీసుకునే ఆహారంలో నూనె వాడకాన్ని 10 శాతం తగ్గించి.. యోగాను ఆచరిద్దామన్నారు. ఈ ప్రయత్నాలన్నీ.. మనల్ని వికసిత్ భారత్ వైపు నడిపిస్తాయన్నారు. శక్తి, ఉత్సాహం నిండిన ఈ పండగ వేళ.. దేశ పౌరులందరికి ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం దేశ పౌరులను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ లేఖ రాశారు. దసరా నవరాత్రులు ప్రారంభ వేళ.. జీఎస్టీ ధరలను భారీగా తగ్గించామన్నారు. ఇదంతా భవిష్యత్తు తరం కోసం సంస్కరణలలో భాగంగా వీటిని చేపట్టామన్నారు. ఈ సంస్కరణల కారణంగా దేశంలోని పౌరులకు రూ. వేల కోట్లు ఆదా చేయడానికి దోహదపడుతుందని తెలిపారు. అంతే కాకుండా ఈ నిర్ణయం జీవితాన్ని సులభతరం చేయడంతోపాటు ఆర్థిక వృద్ధిని పెంచుతుందన్నారు. ఇక భారత్, ఉత్తమ భారత్ స్ఫూర్తిని నిలబెట్టడం కోసం స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా దేశ ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. అన్ని భాషల పట్ల గౌరవం పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే ఆరోగ్యంపై అవగాహన సైతం కల్పించుకోవాలని కోరారు.

# గెలిచిన వారు ఏ పార్టీలో ఉన్నారో ?

### దానం నాగేందర్ స్టార్ కాంపెయినర్ ఎలా

### ఖైరతాబాద్ బస్తీ దవాఖానలను పరిశీలించిన కెటిఆర్

### ప్రభుత్వ వైద్యానికి సుస్తీ పట్టిందని విమర్శ



**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేక పోతున్నారని.. వాళ్ళకి సిగ్గనిపించడం లేదా అని ప్రశ్నించారు. స్పీకర్ దగ్గర తాము పార్టీ మారలేదని అబద్దాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. దానం నాగేందర్ పేరు కాంగ్రెస్ పార్టీ క్యాంపెయినర్ల లిస్టులో ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. దానం నాగేందర్ ఏ పార్టీలో గెలిచారు, ఏ పార్టీకి ప్రచారం చేస్తున్నాడని నిలదీశారు. ఏఐసీసీ అంటే.. ఆల్ ఇండియా కరప్షన్ కమిటీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీలో గెలిచిన వాళ్లను తీసుకుని, వాళ్ల పార్టీ క్యాంపెయినర్ల జాబితాలో పెట్టారని మండిపడ్డారు. రేవంత్ సర్కార్ హైదరాబాద్‌ను గాలికొదిలేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బస్తీ దవాఖానలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. హైదరాబాద్‌ను రేవంత్ గాలికి వదిలేశారని చెప్పారు. ప్రజల ఆరోగ్యం మీద ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి ఖైరతాబాద్ లోని ఇబ్రహీంనగర్ బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రాని సందర్శించారు. ఈ సందర్భంగా బస్తీ దవాఖానలో సదుపాయాలను పరిశీలించారు. మందులు, పరికరాల పని తీరు, దవాఖానలో అందుతున్న వైద్య సేవల వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్ నలువైపులా నాలుగు టిమ్స్ దవాఖానలను ప్రారంభించిందని చెప్పారు. 90 శాతం పనులు బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 10 శాతం పనులు చేయడానికి ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదని మండిపడ్డారు. బస్తీ దవాఖానలను రేవంత్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా తమకు 4 నెలలుగా జీతాలు రావడం లేదని, జీతాల విషయంలో ప్రభుత్వం ఇబ్బందులు పెడుతుందని మహిళా డాక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో సమస్యలపై ఆరా తీశారు. చిన్నారులకు చా÷-లకెట్లు పంపిణీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నాడు కేసీఆర్ హయాంలో ప్రజలకు, ముఖ్యంగా పేదలు అందరికీ అందుబాటులో ఉండేలా 450 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారని తెలిపారు. వాటితో పాటు తెలంగాణ డయాగ్నస్టిక్స్ సెంటర్‌లను ఏర్పాటు చేసి, ప్రజలకు ఉచితంగా పరీక్షలు కూడా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బస్తీ దవాఖానాలను నిర్లక్ష్యం చేసి, ప్రజారోగ్యాన్ని పూర్తిగా పక్కన పెట్టేశారని విమర్శించారు. నాలుగు ఐదు నెలలుగా బస్తీ దవాఖానాలో పనిచేసే సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదని చెప్పారు. బస్తీ దవాఖానల్లో మందు గోలీలు కూడా అందుబాటులో లేవన్నారు. ప్రజారోగ్యం అంటే రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధ ఉన్నదో దీనితో అర్థమవుతుందన్నారు.

# జూబ్లీహిల్స్ ప్రచారం కోసం స్టార్ కాంపెయినర్లు

40మంది పేర్లు విడుదల చేసిన పార్టీ

జాబితాలో మాజీ సిఎం కెసిఆర్ పేరు

హైదరాబాద్,

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక ప్రచారం కోసం భారత రాష్ట్ర సమితి బిఆర్ఎస్ పార్టీ తరపున మొత్తం 40 మంది స్టార్ క్యాంపెయినర్లకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఆమోదం తెలిపింది. ఆ పార్టీ జనరల్ సెక్రెటరీ సోమ భరత్ కుమార్ ఇచ్చిన ప్రతిపాదన మేరకు.. వారికి వాహనాల అనుమతికి పాస్‌లను మంజూరు చేశారు. ఈ ఎన్నికల ప్రచారం అక్టోబర్ 18 నుంచి నవంబర్ 9 సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనున్నది. బీఆర్ఎస్ స్టార్ క్యాంపెయిన్ల జాబితాలో ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు ఉన్నారు. ఈ జాబితాలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు పేరు సైతం ఉన్నది. అలాగే, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, టీ శ్రీనివాస్ యాదవ్, వీ ప్రశాంత్ రెడ్డి, జీ జగదీశ్ రెడ్డి, గంగుల కమలాకర్, సబితా ఇంద్రారెడ్డి, ఎస్ నిరంజన్ రెడ్డి ఉన్నారు. మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్ రావు, వీ శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్ సైతం స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో ఉన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్లు టీ పద్మారావు గౌడ్, పద్మా దేవేందర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు ఎం కృష్ణ రావు, కేపీ వివేకానంద గౌడ్, డీ సుధీర్ రెడ్డి, డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, కాలేరు వెంకటేశం, పాడి కౌశిక్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, అనిల్ జాదవ్, బండారు లక్ష్మా రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, చింతా ప్రభాకర్ సైతం స్టార్ క్యాంపెయినర్లుగా ఉన్నారు. ఎమ్మెల్సీల్లో దాసోజు శ్రవణ్, ముఠా గోపాల్, శంబీపూర్ రాజు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, టాటా మధుసూధన్, ఎల్ రమణా, తక్కెలపల్లి రవీందర్ రావు ఉన్నారు. ఎంపీ వద్దిరాజు రవి చంద్ర, మాజీ ఎమ్మెల్యేలు విష్ణు వర్ధన్ రెడ్డి, షకీల్ అమీర్ మొహమ్మద్, మాజీ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, షేక్ అబ్దుల్లా సోహైల్ పేర్లు సైతం ఉన్నాయి.

# పోలీస్ అంటేనే ఒక నమ్మకం, భరోసా

### విధి నిర్వహణలోఎందరో పోలీసుల ప్రాణార్పణం

### అమరులను సంస్మరించుకోవడం మన విధి

### అమరుల కుటుంబానికి అన్ని విధాలుగా అండ

### నిజామాబాద్ కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి కోటి పరిహారం

### మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాల్సిందే


### ఈగిల్ టీమ్‌తో డ్రగ్స్ ముఠా అరికడుతున్నాం

### సైబర్ నేరాలపై పోలీసుల కృషి ప్రశంసనీయం

### పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భగా రేవంత్ నివాళి

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**















పోలీస్ అంటేనే సమాజానికి ఒక నమ్మకం, భరోసా అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విధి నిర్వహణలో ఒక్కోసారి ప్రాణాలను సైతం పణంగా పెట్టాల్సి వచ్చినా పోలీస్ వెనుకడుగు వేయడని చెప్పారు. ఒకవైపు నెత్తురు చిందుతున్నా... మన రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీరులు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. హైదరాబాద్ గోషామహాల్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పోలీస్ ఫ్లాగ్ డే పరేడ్ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన పోలీస్ అమరవీరుల స్మారక స్థూపాన్ని ఆవిష్కరించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరులకు సీఎం నివాళులు అర్పించారు. విధి నిర్వహణలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఎందరో పోలీసు అమర వీరులను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని సీఎం వ్యాఖ్యానించారు. ఆ బాధ్యతతోనే దేశవ్యాప్తంగా ప్రతీ సంవత్సరం 'అక్టోబరు 21'న 'పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం'గా ఘనంగా నిర్వహించు కుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్లు పేర్కొన్నారు. శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులు ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విధి నిర్వహణలో వీర మరణం పొందిన పోలీసులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా 'అమరులు వారు' పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించి.. తొలి ప్రతిని డీజీపీ శివధర్‌కు అందించారు. అమరులైన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఇటీవల చనిపోయిన ప్రమోద్ కుటుంబానికి అన్ని విధాలుగా సాయం చేస్తాం. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ఇంటిస్థలం కేటాయిస్తున్నాం. పలు విభాగాల్లో మన పోలీసులు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. డ్రగ్స్ మహమ్మారిపై పోరాడేందుకు ఈగల్ పేరుతో బృందాలను నియమించాం. ఇటీవల అనేక మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. జనజీవన స్రవంతిలో కలవాలని మిగతా మావోయిస్టులనూ కోరుతున్నానని సీఎం తెలిపారు. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా 191 మంది పోలీస్ సిబ్బంది, తెలంగాణ రాష్ట్రంలో ఆరుగురు పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించారని గుర్తు చేశారు. గ్రేహౌండ్స్ కమాండోలు.. టి. సందీప్, వి. శ్రీధర్, ఎన్. పవన్ కళ్యాణ్‌లు సంఘవిద్రోహ శక్తులతో పోరాడుతూ వీరమరణం పొందారని చెప్పారు. అసిస్టెంట్ కమాండెంట్ బానోతు జవహర్లాల్, నల్గొండ కానిస్టేబుల్ బి. సైదులు విధినిర్వహణలో మరణించారని అన్నారు. మూడు రోజుల కింద నిజామాబాద్‌లో సీసీఎస్ కానిస్టేబుల్ ఎంపల్లి ప్రమోద్ కుమార్ విధి నిర్వహణలో వీర మరణం చెందారని గుర్తుచేశారు. భర్త ప్రమోద్ ను పోగొట్టుకున్న అతని భార్య ప్రణీతకు, అతి చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయిన అతని ముగ్గురు కుమారులకు, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఒక కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా, అమరుడైన కానిస్టేబుల్ పదవీ విరమణ వరకు లాస్ట్ పే డ్రాన్ సాలరీతో పాటు కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 300 గజాల ఇంటి స్థలం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వీటితోపాటు పోలీస్ భద్రత సంక్షేమం నుండి రూ. 16 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ వెల్ఫేర్ నుండి రూ. 8 లక్షలు ఎక్స్ గ్రేషియాను ప్రమోద్ కుటుంబానికి చెల్లించి వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. 29-06-2008 న ఒరిస్సాలో మావోయిస్టుల దాడిలో మరణించిన 33 మంది పోలీస్ కుటుంబాలకు గాజులరామారంలో 200 గజాల స్థలం కేటాయించామన్నారు. తెలంగాణ పోలీస్ శాఖ అవలంబిస్తున్న విధానాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రాష్ట్ర పోలీస్ శాఖ దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం మా ప్రభుత్వానికి గర్వకారణమని పేర్కొన్నారు. దేశంలోనే తెలంగాణ పోలీస్ శాఖకు ప్రథమ స్థానం లభించిందని ట్ తెలిపారు. అదేవిధంగా, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ విధానంలోనూ విదేశాంగ శాఖ నుంచి ప్రత్యేక అభినందనలు పొందిందని చెప్పారు. ఈ విజయాలు తెలంగాణ పోలీస్ సిబ్బంది నిరంతర కృషి, అంకితభావానికి నిదర్శనమని చెప్పారు. ఇలాగే, ప్రజల భద్రత, శాంతిని కాపాడుతూ, తెలంగాణ పోలీస్ శాఖ దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. తీవ్రవాదం, ఉగ్రవాదం, సంఘ విద్రోహ కార్యకలాపాలు, మతతత్వ ఆందోళనలు, వైట్ కాలర్ నేరాలు, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, కల్తీ ఆహారాలు, గుట్కాలు, మట్కాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు రాష్ట్రంలో పెరగనివ్వకుండా అహర్నిశలు శ్రమిస్తూ తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శంగా నిలిచారు. నేరం చేసి తప్పించుకోలేమన్న పరిస్థితిని సృష్టించడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని పెంచిన తెలంగాణ పోలీస్ శాఖను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. తెలంగాణలో డ్రగ్స్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'ఈగల్' వింగ్ సమర్థవంతంగా తన బాధ్యతలు నిర్వర్తిస్తుంది. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలి అనేది మా ప్రభుత్వ సంకల్పం అని అన్నారు. డ్రగ్స్ దందా వెనక ఎంతటి వారున్నా వదిలిపెట్టొద్దు అనే ఆదేశాలను జారీ చేశాం. ఒకప్పటితో పోలిస్తే నేరాల స్వభావం మారుతోంది. సైబర్ నేరాలు, డిజిటల్ మోసాలు, మార్ఫింగ్ కంటెంట్, డ్రగ్స్, హ్యూమన్ ట్రాఫికింగ్ వంటి కొత్త తరహా నేరాలు పోలీసులకు సవాలుగా మారుతున్నాయి. మానవ నేరాలను మించి సైబర్ క్రైమ్ వార్తలు పత్రికల్లో ఎక్కువ కనిపిస్తున్నాయి. టెక్నాలజీ రూపంలో ఎదురవుతున్న సవాళ్లకు టెక్నాలజీతోనే తెలంగాణ పోలీసులు సమాధానం చెబుతున్న తీరు భేష్.. సైబర్ నేరాలను ఎదుర్కొనేందుకు డీజీపీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో 'సైబర్ సెక్యూరిటీ బ్యూరో'ను ఏర్పాటు చేశాం. ఈ విభాగం అత్యంత సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ దేశంలో ది బెస్ట్ గా నిలిచింది. సైబర్ నేరగాళ్ళను అరికట్టడానికి అంతర్ రాష్ట్ర ఆపరేషన్లు సైతం నిర్వహిస్తున్న తెలంగాణ పోలీసులకు యావత్ దేశం సెల్యూట్ చేస్తోందని అన్నారు. తీవ్రవాదం, మావోయిస్టు కార్యకలాపాలు గతంలో రాష్ట్రంలో విస్తృతంగా జరిగేవి. కానీ నేడు పోలీస్ శాఖ చర్యల వల్ల శాంతి నెలకొంది. మావోయిస్టు ఉద్యమంలో ఉన్న అజ్ఞాత నాయకులను జనజీవన స్రవంతిలో కలవాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఇటీవల కొందరు మావోయిస్టు కీలక నాయకులు లొంగిపోయిన విషయం మీ అందరికీ తెలుసన్నారు. అజ్ఞాతంలో ఉన్న మిగిలిన మావోయిస్టులు కూడా జనజీవన స్రవంతిలో కలిసిపోయి దేశాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని సూచించారు. పోలీసు శాఖలోని పలు కీలక విభాగాల్లో అర్హత కలిగిన మహిళా ఐపీఎస్ అధికారులకు పోస్టింగులు ఇచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచింది. తెలంగాణ పోలీసు అకాడమీ, జైళ్ల శాఖ, ఎస్ఐబీ, ఏసీబీ, సీఐడీ, విజిలెన్స్, ఆర్మ్‌డ్ రిజర్వ్, సీసీఎస్, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకు మహిళా ఐపీఎస్‌ల సారథ్యం వహించడం మా ప్రభుత్వానికి గర్వకారణం. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ఈ కీలక పోలీసు కమిషనరేట్లలో జోన్ డీసీపీలుగా ఏడుగురు మహిళా అధికారులే. రెండేసి కీలక విభాగాలను సైతం సమర్థవంతంగా నడిపిస్తున్న మహిళా ఐపీఎస్ అధికారులను చూసి తెలంగాణ గర్విస్తోందన్నారు. సంఘ విద్రోహ శక్తులు, తీవ్రవాదులు, ఉగ్రవాదుల దాడుల్లో వీరమరణం పొందిన లేదా గాయపడి, అంగవైకల్యం పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి, దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో అత్యధిక నష్టపరిహారం అందించాం. విధినిర్వహణలో వీరమరణం పొందిన పోలీసు కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం, వారి పిల్లలకు రెసిడెన్షియల్ స్కూళ్ళల్లో ఉచిత విద్య, వైద్యం, బస్ పాస్ సౌకర్యం తదితర పథకాలను అందజేస్తున్నాం. మెడికల్ సీట్ల లోను పోలీస్ అమరుల పిల్లలకు ప్రత్యేకంగా సీట్లను కేటాయిస్తున్నాం. తీవ్రవాదుల, ఉగ్రవాదుల హింసలో చనిపోయిన వారికి అందించే ఎక్స్ గ్రేషియాను కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐల వరకు కోటి రూపాయలను, ఎస్సై సీఐలకు కోటి 25 లక్షల రూపాయలను, డీఎస్పీ, అడిషనల్ ఎస్పీలకు కోటి 50 లక్షల రూపాయలను, ఎస్పీలకు ఇతర ఐపీఎస్ అధికారులకు రెండు కోట్ల రూపాయలకు పెంచుతూ మా ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. మన ప్రాణానికి వారి ప్రాణాలను అడ్డుపెట్టే పోలీసుల రుణం ఏమిచ్చినా తీరదు. సమాజ శ్రేయస్సే ఊపిరిగా విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు అండగా నిలవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఒలంపియన్, బాక్సర్ నిఖత్ జరీన్, వరల్డ్ కప్ విన్నర్ క్రికెటర్ మహమ్మద్ సిరాజ్ కు డీఎస్పీగా ఉద్యోగాలు ఇచ్చి తెలంగాణ పోలీసుల ప్రతిష్టతను పెంచాం. ముఖ్యంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు అనేవి అత్యంత ప్రాధాన్యతో కూడిన అంశం. ఈ విషయంలో మా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేస్తూ పోలీసు శాఖ మా అందరిలో స్ఫూర్తి నింపుతోంది. సోషల్ మీడియా ప్రభావం బాగా పెరిగిన ఈ కాలంలో పోలీసుల ప్రతి అడుగు, మాట జాగ్రత్తగా ఉండాలి. 'ఫ్రెండ్లీ పోలీసింగ్' అంటే చట్టాన్ని గౌరవించే పౌరుల కోసమే, చట్టాన్ని ఉల్లంఘించే వారికి కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రజాస్వామ్య పాలనలో ప్రజల హక్కులను కాపాడుతూ, వారి సమస్యలను తెలియజేసేందుకు చేపట్టే నిరసన కార్యక్రమాలకు పోలీసులు అనుమతి ఇస్తూనే, ఈ సందర్భంలో సాధారణ ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఎంతో సున్నితంగా వ్యవహరించాలి. సమాజంలో శాంతి భద్రతలను సుస్థిరంగా ఉంచేందుకు పాటుపడే క్రమంలో విధి నిర్వహణలో తమ ప్రాణాలను అర్పించిన పోలీసు అమర వీరుల త్యాగాలు వెలకట్టలేనివన్నారు. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు.

## తొలి మహిళా ప్రధానిగా సనే తకైచి

### ఎన్నుకున్న జపాన్ పార్లమెంట్

**టోక్యో,**

జపాన్ తొలి మహిళా ప్రధానిగా అతివాద నేతగా పేరున్న సనే తకైచి ఎన్నికయ్యారు. జపాన్ పార్లమెంట్ మంగళవారం దేశంలోని తొలి మహిళా ప్రధానమంత్రిగా సనే తకైచికి ఎన్నుకుంది. పార్టీలో అంతర్గత విభేదాల నేపథ్యంలో జపాన్ ప్రధానిగా ఉన్న షిగెరు ఇషిబా ఇటీవల తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలిగా సనై తకైచి ఎన్నికయ్యారు. ఇటీవల దేశంలో జరిగిన ఎన్నికల్లో పార్లమెంటు ఎగువ సభలో అధికార పార్టీ మెజార్టీని సాధించలేకపోయింది. దీనికి ముందు దిగువ సభలో కూడా మెజార్టీ కోల్పోయింది. దీంతో ఇషిబాపై ఒత్తిడి పెరగ్గా.. ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ఈక్రమంలోనే శనివారం పార్టీలో ఎన్నికలు జరగ్గా.. మాజీ ప్రధాని కుమారుడు షింజిరో కోయిజుమితో పాటు మరో ముగ్గురు అభ్యర్థులను ఓడించి తకైచి విజయం సాధించారు. పార్లమెంట్‌లో జరిగిన ఓటింగ్‌లో లిబరల్ డెమోక్రటిక్ పార్టీ- జపాన్ ఇన్నోవేషన్ పార్టీ కూటమితో.. తకైచికి భారీ మద్దతు లభించింది. దీంతో జపాన్‌కు తొలి మహిళా ప్రధానిగా తకైచి అరుదైన ఘనత సాధించారు. 64 ఏళ్ల తకైచి 1993లో స్వస్థలమైన నారా నుంచి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. ఎల్‌డీపీలో ఆర్థిక భద్రత, అంతర్గత వ్యవహారాలు, లింగ సమానత్వ మంత్రితో సహా పలు కీలక పదవుల్లో పనిచేశారు. జపాన్ తొలి మహిళా ప్రధాని ఎన్నికైన సానే తకైచికి ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. భారత్-జపాన్‌ల ప్రత్యేక వ్యూహాత్మక ప్రపంచ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి తకైచితో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సుల విషయంలో ఇరుదేశాల బంధాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

## అడ్డూఅదుపులేని బంగారం ధరలు

### తులం ధర మరో మూడువేలు పెరుగుదల



**హైదరాబాద్,**

దేశీయ విపణిలో బంగారం, వెండి ధరలు మరోసారి భారీగా పెరిగాయి. క్రితం రోజుతో పోలిస్తే పసిడి ధర మంగలశారం దాదాపు రూ.3వేలు పెరిగింది. హైదరాబాద్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి పుత్తడి ధర రూ.1.34 లక్షలు దాటింది. అటు వెండి ధర కూడా కేజీపై దాదాపు రూ.4వేలు పెరగడం గమనార్హం. హైదరాబాద్‌లో 10 గ్రాముల బంగారం ధర (24 క్యారెట్లు) రూ.1,31,600 పలికింది. మంగళవారం ఆ మొత్తం రూ.1,34,500కు చేరింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,21,000గా ఉంది. మరోవైపు కిలో వెండి ధర సోమవారం రూ.1,67,300 పలికింది. నేడు ఆ ధర రూ.1,71,200కు పెరిగింది. గతవారం రూ.1.85 లక్షల వరకు ఎగబాకిన వెండి ధర ఆ తర్వాత కాస్త తగ్గుతూ వచ్చింది. ఇప్పుడు మళ్లీ గిరాకీ పెరగడంతో బంగారం, వెండి ధరలు మరోసారి పరుగులు పెడుతున్నాయి. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 4,335 డాలర్లు పలుకుతోంది. ఔన్సు వెండి ధర 51 డాలర్ల పైనే ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చితి, రష్యా ఉక్రెయిన్ యుద్ధం, అమెరికా టారిఫ్‌లు, డాలర్ విలువ తగ్గిపోతుండటం వంటి పరిణామాలతో పసిడిలో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గుచూపుతున్నారు. ఈటీఎఫ్ (ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్స్)లలో, కమొడిటీస్ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్‌పై పెట్టుబడులు పెడుతూనే ఉన్నారు. ఇక, పలు దేశాల కేంద్ర బ్యాంకులు భారీగా బంగారాన్ని కొనుగోలు చేస్తుండటం కూడా ధరల పెరుగుదలకు కారణమవుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు, రాబోయేది పెళ్లిళ్ల సీజన్. దీంతో బంగారం ధర మరింత పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

## మహిళా సాధికారతకు చంద్రబాబ కృషి

### శక్తి యాప్‌తో మహిళల భద్రతకు పెద్దపీట

### పోలీస్ అమరవీరుల సంస్మరణలో హోంమంత్రి అనిత

**అమరావతి,**

మహిళా సాధికారత, రక్షణ కోసం సీఎం చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అందులో భాగంగా శక్తి యాప్‌ను తీసుకు వచ్చామన్నారు. మంగళవారం పోలీసుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ అమర వీరులకు హోం మంత్రి అనిత ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాను నిరోధించేందుకు ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్ సమర్థవంతంగా పని చేస్తుందన్నారు. ఆపరేషన్ సేఫ్ పేరిట విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. సైబర్ స్టేషన్ల ఏర్పాటు.. సీసీ కెమెరాలు, డ్రోన్లు సైతం



ఏర్పాటు చేశామని వివరించారు. రాష్ట్ర ప్రజల భద్రత కోసం సీఎం చంద్రబాబు నాయుడు తీసుకుంటున్న చర్యలపై హోమ్ మంత్రి అనిత ప్రశంసలు కురిపించారు. అంతకు ముందు పోలీస్ అమరవీరులకు సీఎం చంద్రబాబు నాయుడు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాతోపాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# డిప్యూటి సిఎం డికెతో కిరణ్ మజుందార్ షా భేటీ

### మేనల్లుడి వివాహానికి ఆహ్వానం అందచేత

**బెంగళూరు,**

భారత సిలికాన్ వ్యాలీగా అభివర్ణించే బెంగళూరులో రోడ్ల దుస్థితిపై పారిశ్రామికవేత్తల విమర్శలు, నేతల వ్యంగ్యాస్త్రాలతో ఇటీవల కర్ణాటకలో రాజకీయ దుమారం రేగిన సంగతి తెలిసిందే. ఈ వివాదం కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో బయోకాన్ లిమిటెడ్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా మంగళవారం భేటీ అయ్యారు. ఉదయం డిప్యూటీ సీఎం నివాసానికి వచ్చిన కిరణ్ మజుందార్ షా.. తన మేనల్లుడి వివాహానికి డీకేను ఆహ్వానించారు. అంతకుముందు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నివాసానికి వెళ్లి ఆయనను కూడా పెళ్లికి ఆహ్వానించినట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. శివకుమార్‌తో భేటీ



అనంతరం కిరణ్ మజుందార్ షా మీడియాతో మాట్లాకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాసేపటికి ఈ సమావేశం గురించి డీకే తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. బెంగళూరు పురోగతి, సృజనాత్మక, రాష్ట్ర అభివృద్ధి మార్గాలపై ఆమెతో చర్చించి నట్లు డీకే వెల్లడించారు. గత కొంతకాలంగా బెంగళూరు రోడ్ల పరిస్థితిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బయోకాన్ పార్క్‌కు వచ్చిన ఓ విదేశీ విజిటర్.. నగరంలోని రోడ్లు, చెత్తపై చేసిన వ్యాఖ్యలతో తాను ఇబ్బందిపడ్డానని కిరణ్ మజుందార్ షా ఓ పోస్టులో వెల్లడించారు. ఇది కాస్తా వైరల్‌గా మారింది. దీనిపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యంగ్యంగా బదులిచ్చారు. ఆమె రోడ్లను అభివృద్ధి చేయాలనుకుంటే చేయొచ్చన్నారు. అందుకోసం నిధులు కూడా ఇస్తామన్నారు. వ్యక్తిగత అజెండాతోనే ఆమె ఈ విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో ఆమెకు పలువురు పారిశ్రామికవేత్తలు మద్దతుగా నిలిచారు. సమస్యకు పరిష్కారం వెతకడం మాని రాజకీయాలు చేస్తున్నారంటూ హర్ష్ గొయెంకా అసహనం వ్యక్తంచేశారు. బెంగళూరు కోసం గళమెత్తే వారిపై దాడులు చేసే ట్రెండ్ సరికాదని, దాన్ని మానుకోవాలని ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్ ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు.

# ప్రజల రక్షణ కోసం ముందుండేది పోలీసులే

### విధి నిర్వహణ కోసం ఎందరో కుటుంబాలకు దూరం

### సమాజంలో శాంతిభద్రతలతోనే పెట్టుబడుల రాక

### పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల కఠిన వైఖరి

### ఈగిల్, శక్తి విభాగాల ఏర్పాటుతో ఆధునికంగా పోలీస్ శాఖ

### డ్రగ్స్,గంజాయి, ఎర్రచందనం ముఠాల ఆటకట్టేల కృషి

### పోలీస్ అమరుల దినోత్సవం సందర్భంగా చంద్రబాబు నివాళి

**అమరావతి,**

ప్రజల రక్షణ కోసం ముందుండేది పోలీసులేనని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విధి నిర్వహణ







కారణంగా తమ కుటుంబంతో సరిగా గడపలేని పరిస్థితి వారిదని చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని 6వ బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత పోలీసు అమరవీరుల స్తూపం వద్ద సీఎం నివాళులర్పించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా 'అమరులు వారు' పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించి మాట్లాడారు. 1959 అక్టోబర్ 21న మన సీఆర్‌పీఎఫ్ దళాలు వీరోచిత పోరాటం చేశాయి. చైనా సైనికులపై పోరాడి 10 మంది భద్రతా సిబ్బంది అమరులయ్యారు. వారిని స్మరించుకుంటూ అమరవీరుల సంస్మరణ దినం నిర్విహించు కుంటున్నాం. వారి త్యాగాలను గుర్తుచేసుకుంటూ మనమంతా స్ఫూర్తి పొందుతున్నాం అన్నారు. సమాజంలో అలజడులు ఉంటే పెట్టుబడులు రావు. శాంతిభద్రతల విషయంలో రాజీపడకుండా పనిచేస్తున్నాం. నేరరహిత సమాజం కోసం అందరూ పనిచేయాల్సిన అవసరముందని సిఎం అన్నారు. సాంకేతికంగా పోలీసు శాఖను బలోపేతం చేస్తున్నాం. సైబర్ నేరాలు, వైట్ కాలర్ నేరాలు పెరిగాయి. సీసీ కెమెరాలు, డ్రోన్లు, గూగుల్ టేకౌట్‌లు విస్తృతంగా ఉపయోగించుకోవాలి. పోలీసు యంత్రాంగానికి సీసీ కెమెరాలు మూడో కన్నులా పనిచేస్తాయి. ఎవరు, ఎక్కడ, ఏ తప్పు చేసినా ఆధారాలతో పట్టుకునే పరిస్థితి రావాలి. ఈగల్, శక్తి బృందాల ఏర్పాటుతో రాష్ట్ర పోలీసు వ్యవస్థ ఆదర్శంగా నిలిచింది. డ్రగ్స్, గంజాయి స్థావరాలను గుర్తించి ధ్వంసం చేస్తున్నాం. స్మగ్లింగ్‌ను పోలీసులు అరికడుతున్నారు. ఎర్రచందనం దొంగల ఆట కట్టిస్తున్నారని అన్నారు. శాంతిభద్రతల విషయంలో రాజీ పడవద్దు ఈ ఏడాది దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 192 మంది పోలీసులు అమరులయ్యారు. అమరులైన పోలీసుల ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా. ప్రజల రక్షణ కోసం పోలీసులు తమ ప్రాణాలు సైతం పణంగా పెడుతున్న పరిస్థితిని చూస్తున్నాం. ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజాన్ని అణచివేయడంలో పోలీసులు మంచి పేరు తెచ్చుకున్నారు. ప్రజల కోసం పరుగులు పెడుతూ విధులు నిర్వహిస్తున్నారు. తమ సంతోషాన్ని త్యాగం చేసి పోలీసులకు సహకరిస్తున్న కుటుంబసభ్యులకు సెల్యూట్ చేస్తున్నా. పోలీసులంటే కఠినంగా ఉంటారను కుంటారు. కానీ మానవత్వంతో వ్యవహరించేది వాళ్లే. విజయవాడలో పిల్లలు చెప్పులు లేకుండా వెళ్తుంటే పెనమలూరు హెడ్‌కానిస్టేబుల్ చెప్పులు కొనిచ్చారు. ప్రజలు ఆస్తులు కాపాడాలనే తపన పడే సిబ్బంది ఉన్నారు. మానవత్వంతో స్పందించే పోలీసు అధికారులు ఉన్నారని ఈ సందర్భంగా వివరించారు. క్రిమినల్స్ సైబర్ టెక్నాలజీలో అప్డేట్ అవుతున్నారు. వారి కంటే ముందుండకపోతే నేరాలను కట్టడి చేయలేం. గూగుల్ పెట్టుబడులు రాష్ట్రంపై నమ్మకంతోనే విశాఖకు వచ్చాయి. ప్రాణం తాత్కాలికం.. చేసే పని శాశ్వతం. సమాజంలో అశాంతి సృష్టించడానికి రాజకీయ ముసుగులో కొత్త నేరాలు చేస్తున్నారు. రాజకీయ కుట్ర, ఫేక్ ప్రచారాలు చేస్తున్నారు. కుల, మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం జరుగుతోంది. సోషల్ మీడియా పెద్ద ఛాలెంజ్‌గా మారింది. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. దీనివల్ల ఎంతో మంది కుమిలిపోతున్నారు. పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం.. నేరస్థులపై కఠినంగా ఉండాలి. శాంతి భద్రతల విషయంలో రాజీ పడవద్దు. నేరస్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తాలి. ప్రభుత్వానికి, ప్రజలకి అండగా ఉండాలి. ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. పోలీసులకు బీమా కల్పించి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. హోంగార్డులకు హెల్త్ ఇన్సూరెన్స్ ఇస్తాం. పోలీసులకు డీఏలతో పాటు సరెండర్ లీవులు ఇస్తున్నాం. 6,100 మంది కానిస్టేబుళ్లను నియమించాం. 2047 నాటికి దేశంలో ఏపీ నంబర్ 1గా ఉండాలి. అన్ని రకాల భద్రత ఉంటేనే ఇది సాధ్యం అని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి అనిత, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# అప్పుల నరకాసురుడిని వధించడమే కర్తవ్యం !

తెలుగు రాష్ట్రాలను అప్పుల నరకాసురుడు వేధిస్తున్నాడు. కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాడు. మనమంతా కలసికట్టుగా ఈ అప్పుల నరకాసరుడిని అంతమొందించాలి. వీడిని మనకు తగించిన రాజకీయ పార్టీలకు తగు విధంగా బుద్ధి చెప్పాలి. లేకుంటే మనమంతా కాళరాత్రిలో కాలం గడపాల్సి ఉంటుంది. ఉమ్మడిగా ఉన్న ఎపిలో లేనంత అవినీతి అక్రమాలు, విడిపోయాక విజృంభించాయి. ఏటా దీపావళి ఆనందాలు వెల్లివిరియాల్సిన చోట..అప్పుల అమావాస్య కమ్మకుంది. ప్రస్తుత, గత పాలకుల తీరు చూస్తే ఈ రెండు రాష్ట్రాలు అప్పుల ఊబినుంచి బయటపడే మార్గం కనిపించడం లేదు. వరాల జల్లు కురిపించడం ద్వారా ప్రజలను నట్టేట ముంచుతున్నారు. అధికారంలోకి వచ్చాక చేతికి ఎముక లేదన్నట్లుగా ఉచిత పథకాలు అమలు చేస్తున్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడులాంటి పెద్దమనిషి అడపదడపా హెచ్చరిస్తున్నా పట్టించుకోవడం లేదు. అలాగని చేసిన అప్పులతో రాష్ట్రాలు బాగుపడ్డాయా అంటే అదీ లేదు. నెలనెలా జీతాలు ఇవ్వడం కూడా ఇప్పుడు ప్రభుత్వ ప్రతిభకు గీటురాయిగా మారింది. అప్పులు చేయడంలో వెనుకబడకూడదని పాలక పార్టీలూ భావిస్తున్నాయి. సంక్షేమ పథకాల పేరిట డబ్బు పంచి పెట్టినంత మాత్రాన ప్రజలు మళ్లీ మళ్లీ గెలిపిస్తున్నారా అంటే అదీ లేదు! ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలూ ప్రజలకు డబ్బు పంచుతున్నాయి. తాజాగా బీహార్ ఎన్నికలు కావచ్చు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కావచ్చు డబ్బు పందేరాలకు రెడీగా ఉన్నారు. ప్రజలుకూడా వచ్చిన కాడికి తీసుకోవాలన్న ధోరణిలో ఉన్నారు. అయితే డబ్బు తీసుకుంటున్న ప్రజలు మాత్రం తాము అనుకున్న వారికే ఓటు వేస్తున్నారు. ఈ డబ్బు పంపకం ఆగితే తప్ప మన ప్రజాసవామ్యం బాగుపడదు. అలాగే సంక్షేమ పథకాల పేరుతో చేస్తున్న డబ్బు పందేరాలకు కూడా ఎక్కడో ఒక చోట ఫుల్ స్టాప్ పడకపోతే తిప్పలు తప్పేలా లేవు. అలాగే పథకాలు పొందని ప్రజలు, పన్నులు చెల్లిస్తున్న వారు దీనిని నిలదీయక మానరు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో గత పన్నెండేళ్లుగా ఇదే సాగింది. భావి తరాలకు మంచి భవిష్యత్తు ఇవ్వడం ఎలా అన్నది పక్కకు పోయింది. అపపులు చేసి పండగ చేస్తున్నారు. ప్రజలు కూడా అలవాటు పడ్డారు. ఓట్ల పండగ రావాలని కోరుకుంటున్నారు. ఈ పద్దతి మారకుంటే అభివృద్ది అన్నది పక్కకు పోయి పంచడమే పాలన అనే పద్దతి పాకిపోతుంది. అలా జరగకుండా రాజకీయ పార్టీలను కట్టడి చేయడానికి ప్రజలే పూనుకోవాలి. ప్రజలే చొరవ తీసుకొని హద్దులు మీరుతున్న సంక్షేమ పథకాల అమలుపై నిరసన గళం ఎత్తాలి. అప్పులతో ప్రజలకుపంచడంతో పాటు, పాలకులు కూడా సోకులు చేసుకుంటున్నారు. ఇలా ఎంతకాలం చేసిన ప్రజలకు అమావాస్య చీకట్లు తప్పవు. పాలకలుకు నిత్యదీపావళి కూడా తప్పదు. తాజా పరిస్థితులు చూస్తుంటే ఆందోళన కలుగుతోంది. ఎంతకాలమీ అప్పుల జాతర అన్నది తెలియడం లేదు. లేని పక్షంలో రెండు తెలుగు రాష్ట్రాలు కోలుకోలేని విధంగా అప్పుల ఊబిలో కూరుకుపోతాయి!అప్పు చేయనిదే పూట గడవని పరిస్థితి ఉన్నప్పటికీ రెండు రాష్టాల్లో కొనసాగుతోంది. ప్రభుత్వాల మాటలు మాత్రం కోటలు దాటు తున్నాయి. ఏదడిగినా లేదనకుండా హామీలు ఇచ్చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలకేఈ దుస్థితి ఎందుకు వచ్చిందన్నది తెలుసుకోవాలి. ఎపి విభజన తరవాత కెసిఆర్, జగన్ చేసని నిర్వాకంతో ఇదంతా మొదలయ్యింది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తెలంగాణ ధనిక రాష్ట్రమని కెసిఆర్ ఊరూరా ఊదరగొట్టారు. రాష్ట్రం రెవెన్యూ మిగులులో ఉందని కేసీఆర్ ప్రకటించారు. అదే సమయంలో విభజిత ఆంధ్రప్రదేశ్ రూ.20 వేల కోట్లకు పైగా రెవెన్యూ లోటుతో ఏర్పడింది. 11 ఏళ్లు గడిచేసరికి ధనిక రాష్ట్రమైన తెలంగాణ కూడా అప్పుల కుప్పగా మారింది. అప్పు కోసం వెళితే దొంగను చూసినట్టు చూస్తున్నారని ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాస్తవాన్ని బయటపెట్టారు. తెలంగాణ పరువు తీస్తావా అని బిఆర్ఎస్ నేతలు రేవంత్‌పై కత్తులు దూస్తున్నారు. ఆంధ్రలో కూడా ఇదే దుస్థితి ఉంది. జగన్ తనను తాను ఓ యువరాజుగా భావించి భీమిలి బీచ్ వద్ద ప్యాలెస్‌లు కట్టుకున్నారు. రాష్ట్రం అప్పులు పది లక్షల కోట్లు దాటాయి. అటు ధనిక రాష్ట్రం, ఇటు రెవెన్యూ లోటుతో ఏర్పడిన రాష్ట్రం కూడా కుదేలవడానికి కారణం ఇద్దరు నేతలే అని వేరుగా చెప్పనక్కర్లేదు. పలు పతకాల పేరుతో రాష్ట్రాలను లూటీ చేయించారు. ప్రజాధనాన్ని పప్పు బెల్లాల్లా పంచిపెట్టడంతో ఇప్పుడు దివాళకు చేరుకున్నాయి. దారుణం ఏమంటే సంక్షేమ పథకాలకు కూడా అప్పులు చేయవలసి వస్తోంది. వేలకోట్లు వడ్డీలుగా చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వ ఆస్తులను కుదువ పెట్టడమే కాకుండా, భవిష్యత్ ఆదాయాలను కూడా తాకట్టు పెట్టి అప్పులు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయడం వల్లనే తెలుగునాట దుర్భర పరిస్థితి దాపురించింది.




అధికారం కోసం రాజకీయ పార్టీలు అడ్డమైన గడ్డి తింటాయనడానికి ఈ రెండు రాష్ట్రాల ఆర్థిక దుస్తితి కారణంగా చెప్పు కోవాలి. ఇప్పుడు పాలకులు దీని నుంచి బయటపడకుండా మరీ అప్పులు చేసేస్తున్నారు. సంక్షేమం పేరిట అలవికాని పథకాలను ప్రకటిస్తూ తెలుగు రాష్ట్రాలను దివాలా తీయిస్తున్నారు. దీంతో ప్రజలకు మౌలిక సదుపాయాలు కరువై అల్లాడుతున్నారు. ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని తెలిసి కూడా కొత్త పథకాల ప్రకటనలో పాలకపార్టీలు తగ్గేదేలే అన్నట్టుగా పోటీ పడుతున్నాయి. ఉచితబస్సు, ఉచిత బియ్యం, ఉచితంగా వేల రూపాయల బదిలీలు ..వంటివన్నీచేస్తున్నారు. కానీ ఒక్క రోడ్డు గుంత పూడ్చడానికి మత్రం డబ్బులు ఉండడం లేదు. ఎన్నికల్లో ప్రయోజనం పొందడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలను రేసు గుర్రాల్లా వదిలారు. అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల కోసం ప్రస్తుత రేవంత్ హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూములను కూడా ఎడా పెడా అమ్మేస్తున్నారు. అయినా రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతూనే ఉంది. రైతు రుణ మాఫీ కోసం దాదాపు పాతిక వేల కోట్ల రూపాయలు పంచిపెట్టిన తీరువవల్ల కలిగిన ప్రయోజనం కూడా అంతంత మాత్రమే. జగన్ బాధపోయినా ఆంధ్రప్రదేశ్‌లో కూడా సంక్షేమ పథకాల జాతర ఆగడం లేదు. తెలంగాణలో ప్రారంభమైన అనేక పథకాలను ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆపసోపాలు పడుతున్నరు. 2 1ప్పుల నరకాసురుడిని మనమే కాల్చాలి. ప్రజలే ఇందుకు పూనుకోవాలి. పథకాల పేరుతో చేస్తున్న అప్పులపై ప్రశ్నించాలి. అప్పుడే మనకు నిజమైన దీపావళి అని గుర్తించాలి.

## నడిరోడ్డు పైన బాణాసంచ విక్రయం.....

### రక్షణ చర్యలు శూన్యం..

### -బాణసంచావిక్రయాలకు అనుమతులు ఉన్నట్లా లేనట్లా...





అక్షర కలం నాగార్జునసాగర్ ప్రతినిధి ...

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి అని, అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేసి అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలియజేస్తున్నా అధికారుల మాటలు లెక్క చేయకుండా నందికొండ మున్సిపాలిటీలోని స్థానిక హిల్ కాలనీ, పైలాన్ కాలనీలో నడిరోడ్డు పైన టెంట్లు వేసి మరి విక్రయాలు కొనసాగిస్తున్నారు.బాణసంచా విక్రయాలకు అనుమతి లేకుండానే వ్యాపారం, కొనసాగిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. లక్షల రూపాయల విలువ చేసే బాణసంచా నిల్వ చేసి అధికారులను మచ్చిక చేసుకొని గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారం కొనసాగిస్తారని సమాచారం. బాణాసంచా విక్రయం అనేది సంబంధిత శాఖ అధికారుల అనుమతి తీసుకుని ఊరి చివర ఒక ప్రాంతాన్ని ఎన్నుకుని ఆ ప్రాంతంలో అమ్మకాలు సాగించాల్సి ఉంది , కానీ నందికొండ మున్సిపాలిటీలో వ్యాపారస్తులు అవేవీ మాకు పట్టవు అన్నట్లు నడి రోడ్లపైనే టెంట్లు వేసి మరీ విక్రయాలు సాగిస్తూ ఉంటే పొరపాటున ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే దానికి ఏ అధికారి బాధ్యత వహిస్తారని స్థానిక అధికారులు ఆ ప్రమాద కరమైన బాణాసంచాలు విక్రయించే వ్యాపారులకు అండదండగా ఉంటారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఐదు కేజీల బరువైన బాణసంచా నిల్వ చేసుకునేందుకు ఎటువంటి అనుమతులు అక్కర్లేదు. అంతకు మించితే కచ్చితంగా పోలీసులు, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. మున్సిపాలిటీలో అక్రమ బాణాసంచా విక్రయం జరుగుతుందా లేక అన్ని రకాల అనుమతులతోనే వ్యాపారం కొనసాగిస్తున్నారా అనేది అధికారులు తేల్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. మెయిన్ బజార్లో రోడ్డుకు అడ్డంగా బాణసంచా విక్రయాలు చేస్తున్నారని వ్యాపారస్తులని అనుమతులు ఉన్నాయని అడిగితే , మాకు అన్ని అనుమతులు ఉన్నాయని , మాకు ఇష్టం వచ్చినట్టు మేము అమ్ముకుంటాము , మీరు ఏం చేసుకుంటారో చేసుకో అని సమాధానం చెప్పడం విడ్డూరంగా ఉంది.

## బుద్ధ వనంలో ఘనంగా ధమ్మ దీపోత్సవం...



అక్షర కలం నాగార్జునసాగర్ సాగర్ ప్రతినిధి...

నాగార్జునసాగర్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బుద్ధవనం ప్రాజెక్టులో ధమ్మ దీపోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించామని బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య తెలిపారు . వేలకు పైగా దీపాలతో అలంకరించిన బుద్ధ వనంలో మంగళవారం సాయంత్రం ఎంట్రన్స్ ప్లాజా లోని అశోక ధర్మచక్రం వద్ద ముఖ్యఅతిథిగా పాల్గొన్న బి ఇ ఏ సి ఐ చైర్మన్ రతన్ దీప్ కాంబ్లే మొదటి దీపాన్ని వెలిగించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మంచి చెడులను విశ్లేషించి మంచిని మాత్రమే స్వీకరించే నైతికను జీవన విధానంగా బోధించిన బుద్దుని మార్గం ఆచరణీయమని దమ్మ దీపోత్సవ నేపథ్యాన్ని వివరించి ఇక ముందు కూడా క్రమం తప్పకుండా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బౌద్ధాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో వ్యాపారులకు దీపావళి శుభాకాంక్షలు



అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 21:

దీపావళి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని వ్యాపారులకు బిజెపి నాయకులు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని మార్కెట్ రోడ్, శ్రీనివాస టాకీస్ రోడ్, గంగారెడ్డి రోడ్డులో గల ప్రతి షాపుకు వెళ్లి, వ్యాపారులకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, నాయకులు దుర్గం అశోక్, అమిరిశెట్టి రాజ్ కుమార్, రంగ శ్రీశైలం, సత్రం రమేష్, కుర్రె చక్రవర్తి, గడ్డం స్వామి రెడ్డి, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, పట్టి వెంకటకృష్ణ, కమలాకర్ రావు, బియ్యాల సతీష్ రావు, వైద్య శ్రీధర్, పల్లి రాకేష్, కర్రె లచ్చన్న, బింగి ప్రవీణ్, బోయిని దేవేందర్, ఆకుల నరేందర్ కాశెట్టి నాగేశ్వర్ రావు, చిరంజీవి, తరుణ్ లు పాల్గొన్నారు.

## నేటినుంచి ఆస్ట్రేలియ పర్యటనకు లోకేశ్

### సిఐఐ సదస్సుకు పెద్దెత్తున ప్రచారం

అమరావతి,

ఏపీ విద్యా,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నేటినుంచి ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. ఈనెల 19 నుంచి 24 వరకు ఆరు రోజులపాటు ఆస్ట్రేలియాలో లోకేష్ పర్యటిస్తారు. ఈ మేరకు మంత్రి ఆస్ట్రేలియా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఇందులో భాగంగా ఆస్ట్రేలియా వర్సిటీల్లో అధునాతన బోధనా పద్ధతులపై అధ్యయనం చేయనున్నారు. సీఐఐ పార్ట్‌నర్ షిప్ సమ్మిట్ విజయవంతంపై రోడ్ షోలకు మంత్రి లోకేష్ హాజరుకానున్నారు. కాగా.. ఏపీకి భారీ పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా మంత్రి లోకేష్ ఇప్పటికే వివిధ దేశాల్లో పర్యటించిన విషయం తెలిసిందే. ఆయా పర్యటనలు విజయవంతమై అనేక కీలక పెట్టుబడులను రాష్ట్రానికి తీసువచ్చారు. తాజాగా ఇప్పుడు ఆస్ట్రేలియాలో మంత్రి లోకేష్ పర్యటించనున్నారు. ఆదివారం నుంచే ఈ పర్యటన కొనసాగనుంది. ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్‌లో పాల్గొనాలని లోకేష్‌కు ఢిల్లీలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ ప్రత్యేక ఆహ్వాన లేఖను పంపిన విషయం తెలిసిందే.

## పంజాబ్‌లోని పాక్ సరిహద్దుల్లో బండి పర్యటన

### సరిహద్దు గ్రామాల్లో

### వరదబాధితులకు పరామర్శ

### వారిని ఆదుకుంటామని మంత్రి హామీ

చండీఘడ్,

):కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పంజాబ్ రాష్ట్రంలోని భారత్-పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. రెండ్రోజుల పర్యటనలో భాగంగా శు క్రవారం పంజాబ్ లోని అమృత్‌సర్ విచ్చేసిన కేంద్ర మంత్రి శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు గురుదాస్ పూర్ జిల్లాలోని భారత సరిహద్దుకు ఆనుకుని ఉన్న గ్రామాలను సందర్శించారు. ఇటీవల వచ్చిన భారీ వరదల పంజాబ్ రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం దాదాపు 23 జిల్లాలు వరద ప్రభావితమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 2,097 గ్రామాలు వరద ముంపుకు గురయ్యాయి. 3,88,092 మంది ప్రజలు వరదలవల్ల నష్టపోయారు. 56 మంది మరణించారు. 5 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ఇదులో దాదాపు 3 లక్షల ఎకరాల పంట పూర్తిగా దెబ్బతిన్నది. భారీగా ఆస్తి, పశు సంపద నష్టం సంభవించింది. 10 వేలకు పైగా ఇండ్లు ధ్వంసమయ్యాయి. రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మరోవైపు పంజాబ్ లో వరదలతో గురుదాస్ పూర్ జిల్లా అత్యధికంగా నష్టపోయింది. ఈ జిల్లాలో 329 గ్రామాలు వరద ముంపుకు గురయ్యాయి. ఈ ఒక్క జిల్లాలోనే 1.45 వేల మంది ప్రజలు నిరాశ్రయుల య్యారు. 87 వేల 569 ఎకరాల్లో పంట పూర్తిగా దెబ్బతిన్నది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ గురుదాస్ పూర్ జిల్లాలో పర్యటించారు. ప్రధానంగా ఈ జిల్లా భారత-పాకిస్తాన్ సరిహద్దులో ఉన్న 11 గ్రామాలను సందర్శించారు. దేరాబాబాద్ నానక్ ప్రాంతంలోని నంగ్లీ, ఘనియక్ బేట్, గురుచుక్, సమురాయ్, తపాలా, రన్ సేక్ తల్లాన్, డాబుర్జీ, ధర్, రహమద్ బాద్, మస్రాలా, నబీ నగర్, బర్రై గ్రామాలు ఇందులో ఉన్నాయి. తొలుత నంగ్లీ గ్రామంలో పర్యటించారు. ఈ గ్రామం పూర్తిగాట బీఎస్ఎఫ్ అధికారుల పహారాలో ఉంది. వరదలవల్ల ఈ గ్రామ ప్రజల ఇండ్లల్లోకి దాదాపు 20 అడుగుల మేరకు నీళ్లు వచ్చాయని, బాధితులందరికీ సురక్షితంగా పునరావాసా కేంద్రాలకు తరలించి భోజన, వసతిసహా కనీస సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఈ సదర్భంగా బీఎస్ఎఫ్ అధికారులు కేంద్ర మంత్రి బండి సంజయ్ కు వివరించారు. వారితో కలిసి దేశ సరిహద్దు ఫెన్సింగ్ వరకు వెళ్లారు. ఆ ప్రాంతంలో జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. బైనాక్యులర్స్ ద్వారా వరద ముంపు ద్రుశ్యాలను వీక్షించారు. ఫెన్సింగ్ అవతలి వైపు పాకిస్తాన్ సైనికులు ఎవరూ కన్పించకపోవడంతో ఇదే విషయాన్ని బీఎస్ఎఫ్ సిబ్బందిని అడిగారు. వరదలు రావడంతో సరిహద్దుకు ఆవతల గస్తీ కాస్తున్న పాకిస్తాన్ సైనికులు పత్తా లేకుండా పోయారని తెలిపారు. వెంటనే కేంద్ర మంత్రి స్పందిస్తూ వానలు, వరదలను లెక్క చేయకుండా నిరంతరం గస్తీ కాయడమే కాకుండా బాధితులను రక్షిస్తూ వారికి అన్ని విధాలా అండగా ఉన్న బీఎస్ఎఫ్ సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ సిబ్బందితో ముచ్చటించారు. వారి ధైర్యసాహసాలు, త్యాగాలను కొనియాడారు. వారితో కలిసి సెల్ఫీ దిగారు. అనంతరం నంగ్లీ గ్రామ రైతులను కలిశారు. వారి బాధలను విన్నారు. అక్కడి నుండి నేరుగా గురుచుక్ వెళ్లారు. రావి నది వరదలతో ఆ గ్రామంలోని పంటలన్నీ పూర్తిగా ధ్వంసమవడమే కాకుండా కిలోమీటర్ల మేరకు ఆ భూముల్లో మేటలు వేసి సాగుకు పనికి రాకుండా పోయిన ద్రుశ్యాలను చూశారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి వారు పడుతున్న బాధలను, జరిగిన నష్టాన్ని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు, అధికారులు ముంపు ప్రాంతాల్లో పర్యటించారా? లేదా? అని అడిగితే 'ఒక్క మంత్రి, అధికారి కానీ ఇంతవరకు తమ గ్రామంలోకి అడుగు పెట్టలేదని స్థానిక రైతులు వాపోయారు. ఈ గ్రామంలో పర్యటిస్తున్న తొలి మంత్రి మీరేనని, కేంద్రమే ఆదుకోవాలని మొరపెట్టుకున్నారు. రెండేళ్లపాటు పంటలు సాగు చేసుకోవడానికి కూడా భూములు పనికిరావని, అన్ని విధాలా సాయం అందించాలని కోరారు. కేంద్ర మంత్రి పర్యటించిన ఇతర గ్రామాల్లోనూ ప్రజలంతా దాదాపు ఇదే బాధను వెలిబుచ్చారు.ఈ సందర్భంగా గురుచుర్, సమురయ్, ఘనియక్ బేట్, రన్ సేక్ తల్లాన్ గ్రామాల ప్రజలతో కేంద్ర మంత్రి మాట్లాడారు. ఆయా గ్రామాల్లోని వరద బాధితులకు నెలకు సరిపడా బియ్యం, పప్పు, మసాలా దినసులతో కూడిన 'మోడీ కిట్ల'ను కేంద్ర మంత్రి బండి సంజయ్ స్వయంగా అందజేశారు. అనంతరం ఆయా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. వరద ముంపు బాధితులు తీవ్రమైన కష్టాల్లో ఉన్న విషయాన్ని కేంద్రం గుర్తించిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆదేశాలతోనే పంజాబ్ ప్రజలకు భరోసా ఇచ్చేందుకే తాను ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. అన్నదాతలెవరూ ఆందోళన చెందవద్దన్నారు. నష్టపోయిన పంజాబ్ రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.1600 కోట్ల తక్షణ సాయం విడుదల చేసినట్లు తెలిపారు.ఇవిగాకుండా రూ.1200 కోట్ల ఎన్డీఆర్ఎఫ్ నిధులు సైతం రాష్ట్రం వద్దే ఉన్నాయని గుర్తు చేశారు. వరదల్లో ఇండ్లు కోల్పోయిన వారందరికీ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆస్థి, పంట, ఇతరత్రా నష్టాలపైనా పూర్తి నివేదిక వచ్చాక ప్రజలకు తగిన సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. నిరాశ్రయులకు తక్షణ సాయంగా బియ్యం, పప్పు, ఉప్ప, మసాల దినుసులతో కూడిన 'మోడీ కిట్స్' ను అందిస్తున్నట్లు తెలిపారు. వరదలవల్ల పంజాబ్ కు ముఖ్యంగా గురుదాస్ పూర్ జిల్లాకు జరిగిన నష్టాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడీకి నివేదించ బోతున్నట్లు పేర్కొన్నారు. కష్టకాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోకపోవడం బాధాకరమన్నారు. అయినప్పటికీ పంజాబ్ ప్రజలు అధైర్యపడొద్దని, ఆందోళన చెందాల్సిన అవసరమే లేదన్నారు. మోడీ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, మోడీ ఆదేశాల మేరకు ఆ భరోసా ఇచ్చేందుకే తాను పంజాబ్ కు విచ్చేసినట్లు వివరించారు.

## ధనత్రయోదశి సందడి లేని బెజవాడ

### ధరలు పెరగడంతో కన్నెత్తి చూడని జనం

విజయవాడ,

నగరంలో ధన త్రయోదశి పెద్దగా కనిపించ లేదు. బంగారం దుకాణాల దగ్గర రద్దీ కనిపించలేదు. గత ఏడాదితో పోలిస్తే 80 శాతానికి పైగా గోల్డ్ ధరలు పెరిగాయి. గత ఏడాది ధన త్రయోదశి సమయానికి 24 క్యారెట్ల బంగారం గ్రాము ధర 7200 రూపాయలు ఉండగా, ఈ ఏడాది గ్రాము ధర 13,200 రూపాయలకు చేరుకుంది. రెట్టింపు ధరలకు బంగారం రేట్లు పెరగటంతో కొనుగోలుదారులు ఆసక్తి చూపడం లేదు. ఇక, ధన త్రయోదశి సెంటిమెంట్ కారణంగా గత ఏడాదితో పోలిస్తే కేవలం సగానికి పైగా తగ్గించి బంగారం కొనుగోలు చేశామంటున్నారు గోల్డ్ ప్రియులు. బంగారం షాపుల్లో 50 శాతానికి పైగా బంగారం అమ్మకాలు తగ్గిపోయాయి. రోజు రోజుకు పెరుగుతున్న బంగారం ధరలతో వేచి చూసే ధోరణిలో పసిడి ప్రియులు ఉన్నారు. దీంతో ఈసారి గోల్డ్ కొనుగోలు తగ్గిపోవడంతో వ్యాపారులు సైతం కొంతమేర ఇబ్బందులు పడుతున్నారు.

## సుహృద్భావ వాతావరణంలో చర్చలు

### పిఆర్సీపై త్రిసభ్య కమిటీ వేయండి

### మంత్రులతో చర్చల్‌లో ప్రతిపాదన

### గతంలో ఉన్న ఎరియర్స్ చెల్లింపునకు డిమాండ్

### ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ

అమరావతి,

ప్రభుత్వంతో మంచి వాతావరణంలో చర్చలు జరిగాయని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ అన్నారు. గతంలో ఉన్న ఎరియర్స్ ఇవ్వాలని కోరామన్నారు. 2018, 2019కి సంబంధించిన డీఏలను చెల్లించాలని కోరినట్లు చెప్పారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తితో పీఆర్సీపై త్రిసభ్య కమిటీ వేయాలని సూచించామన్నారు. శనివారం ఉద్యోగ సంఘాలతో మంత్రివర్గ ఉపసంఘం భేటీ ముగిసింది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# స్పోర్ట్స్



## ప్రధాన కోచ్, కెప్టెన్‌తో వివరణాత్మక చర్చలు

**జట్టు ఎంపికలో భిన్నాభిప్రాయాలు వచ్చాయి**

**అందరి సహకారంతోనే ఎంపిక ప్రక్రియ**

**ఉత్తమమైన 15 మందిని ఇవ్వడం మా పని**

**షమీ ఫిట్‌గా లేనందునే ఎంపిక కాలేదు**

**బీసీసీఐ చైర్మన్ అజిత్ అగార్కర్ వెల్లడి**

భారత క్రికెట్ నియంత్రణ మండలిచైర్మన్ అజిత్ అగార్కర్, ఎంపిక సమావేశాలు మూసి ఉన్న తలుపుల వెనుక చాలా వేడిగా జరుగుతాయని వెల్లడించారు. జట్టు ఎంపిక గురించి చర్చిస్తున్నప్పుడు మాజీ భారత ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో దాదాపు "పోరాటం" జరిగిందని కూడా ఆయన అంగీకరించారు. అగార్కర్ భారత ఎంపిక ప్రక్రియ యొక్క అంతర్గత పనితీరుపై అరుదైన అంతర్దృష్టిని అందించారు, అయితే ఏ ఆటగాడి ఎంపిక వేడి చర్చకు దారితీసింది అని ఆయన పేర్కొనలేదు. అగార్కర్, "నా ఉద్దేశ్యం, రాహుల్ ద్రవిడ్ గతంలో కోచ్‌గా ఉన్నారు. అతను నాకు మంచి స్నేహితుడు. నేను దానిని పోరాటం అని పిలవను, కానీ అతను ఏమి కోరుకుంటున్నాడనే దాని గురించి మాకు కొన్ని నిజమైన భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఎందుకంటే మేము జట్టు యొక్క ఉత్తమ ప్రయోజనాల కోసం పనిచేయడానికి ప్రయత్నిస్తున్నాము." ఎంపిక ప్రక్రియ సహకారంతో జరుగుతుందని, మొత్తం ఎంపిక కమిటీ, ప్రధాన కోచ్, కెప్టెన్‌తో వివరణాత్మక చర్చలను కలిగి ఉంటుందని అగార్కర్ నొక్కి చెప్పారు. ఐదుగురు సెలెక్టర్లు పాల్గొంటున్నందున, అభిప్రాయ భేదాలు సాధారణం కానీ మెరుగైన నిర్ణయం తీసుకోవడాన్ని నిర్ధారించే వ్యవస్థలో భాగం. "చివరికి, మీరు ఆ ఎంపిక సమావేశానికి వచ్చినప్పుడు, మనలో చాలా మంది ఒక విషయంపై అంగీకరిస్తాము," అని అతను చెప్పాడు. "మేము చాలా చర్చలు జరిపాము. చాలా భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఇది ముఖ్యం. విభిన్న అభిప్రాయాలను కలిగి ఉన్న ఐదుగురు వ్యక్తులు ఉంటారు. ఆశాజనకంగా, ఐదుగురు పూర్తిగా భిన్నమైన అభిప్రాయాలు ఉండకపోవచ్చు. కానీ మనకు ఈ భిన్నాభిప్రాయాలు ఉన్నాయంటే ఒక నిర్దిష్ట స్థానానికి ఒకటి కంటే ఎక్కువ ఎంపికలు ఉంటాయి." జట్టులో ఎక్కువ మంది తరచుగా స్వయంగా ఎంపిక చేయబడతారని ఆయన అన్నారు. సాధారణంగా 12 నుండి 14 మంది ఆటగాళ్లను ఖరారు చేస్తారు. చర్చ సాధారణంగా ఒకటి లేదా రెండు స్థానాలపై కేంద్రీకృతమై ఉంటుంది. అప్పుడప్పుడు విభేదాలు ఉన్నప్పటికీ, ప్రతి నిర్ణయం జట్టు ప్రయోజనాల కోసమే తీసుకోబడుతుందని అగార్కర్ స్పష్టం చేశారు."చివరికి, ఇది మా నిర్ణయం. ఇది గతంలో రాహుల్‌తో అయినా లేదా ఇప్పుడు గౌతమ్ %ళి%గంభీర్%ఠి%తో అయినా. కెప్టెన్‌లతో కూడా, మొదట రోహిత్ ఇప్పుడు శుభ్‌మాన్‌తో అయినా, మేము విషయాలను చర్చిస్తాము. కెప్టెన్, కోచ్ జీవితాన్ని కొంచెం సులభతరం చేయడానికి సాధ్యమైనంత ఉత్తమమైన 15 మందిని ఇవ్వడం మా పని. వారిని చర్చలో చేర్చకపోవడం అవివేకమని అన్నారు.. మరోవైపు భారత క్రికెట్ జట్టు స్టార్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ కు కొత్త సమాధానం ఇచ్చారు.



ఒక కార్యక్రమంలో, షమీ గురించి అడిగిన ప్రశ్నకు సమాధానంగా, అజిత్ అగార్కర్, తాను పూర్తిగా ఫిట్ గా లేనందున ఇంగ్లాండ్ మరియు ఆస్ట్రేలియా పర్యటనలకు టీం ఇండియాకు ఎంపిక కాలేదని అన్నారు. అయితే, షమీ తాను పూర్తిగా ఫిట్ గా ఉన్నానని నమ్ముతున్నాడు. షమీ ప్రస్తుతం రంజీ ట్రోఫీలో బెంగాల్ తరపున ఆడుతున్నాడు. అందువల్ల, ఆస్ట్రేలియాతో




జరిగిన వన్డే సిరీస్ నుండి అతనిని తొలగించడం చాలా ఆశ్చర్యం కలిగించింది. షమీ చివరిసారిగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో టీం ఇండియా తరపున ఆడాడు మరియు అప్పటి నుండి ఎంపిక కాలేదు. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో ఉత్తరాఖండ్‌తో జరిగిన మ్యాచ్ యొక్క మూడవ రోజున, హిందూస్తాన్ టైమ్స్ నుండి అజిత్ అగార్కర్ గురించి అడిగిన ప్రశ్నకు షమీ సమాధానంగా, "అతను ఏమి కావాలో చెప్పనివ్వండి. ప్రతిదీ మీ కళ్ళ ముందు ఉంది. నేను ఎలా బౌలింగ్ చేస్తున్నానో మీరు చూడవచ్చు" అని అన్నారు. ఉత్తరాఖండ్‌తో జరిగిన మొదటి ఇన్నింగ్స్‌లో షమీ 37 పరుగులకు 3 వికెట్లు పడగొట్టాడు. అజిత్ అగార్కర్ టీం ఇండియాకు సంబంధించిన అనేక అంశాలపై బహిరంగంగా మాట్లాడారు. షమీ ఎంపిక కాకపోవడం గురించి కూడా ఆయనను అడిగారు. షమీ గురించి అగార్కర్ మాట్లాడుతూ, "గత ఆరు నెలల్లో నేను షమీతో చాలాసార్లు మాట్లాడాను. అతను పూర్తిగా ఫిట్‌గా లేడని మేము కనుగొన్నాము. అతను ఫిట్‌గా ఉంటే, కథ వేరేలా ఉండేది, కానీ అతను ఫిట్‌గా లేనందున, అతను ఇంగ్లాండ్ పర్యటనకు ఎంపిక కాలేదు." అజిత్ అగార్కర్ ప్రకటనపై షమీ తన అసంతృప్తిని వ్యక్తం చేశాడు. తన ఫోన్ ఎప్పుడూ ఆన్‌లో ఉంటుందని ఆయన అన్నారు. గతంలో, తన ఫిట్‌నెస్ గురించి బీసీసీఐ లేవనెత్తిన ప్రశ్నలపై షమీ తన అసంతృప్తిని వ్యక్తం చేశాడు. షమీ తన ఫిట్‌నెస్‌ను మెరుగుపరచుకోవడానికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కొంత సమయం గడిపాడు, కానీ ఫిట్‌గా ఉన్న తర్వాత కూడా అతన్ని విస్మరిస్తున్నారు.

## దేశీయ క్రికెట్‌లో సత్తాచాటుతున్న రింకూ సింగ్

### ఆంధ్ర జట్టుపై అజేయంగా 165 పరుగులు

ఆస్ట్రేలియాతో త్వరలో జరగబోయే కీలకమైన టీ20 సిరీస్‌కు ముందు టీమిండియా మిడిలార్డర్ బ్యాటర్ రింకూ సింగ్ దేశీయ క్రికెట్‌లో తన సత్తాను చాటాడు. కాన్పూర్‌లో జరిగిన రంజీ ట్రోఫీ ప్రారంభ మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ తరఫున ఆడిన రింకూ.. ఆంధ్ర జట్టుపై అసాధారణమైన పోరాట పటిమతో అజేయంగా 165 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ మెగా ఇన్నింగ్స్‌లో 13 ఫోర్లు, 2 సిక్సర్లు ఉన్నాయి. ఇది కేవలం యూపీ జట్టును కష్టాల నుంచి గట్టెక్కించడమే కాకుండా అక్టోబర్ 29 నుంచి ప్రారంభమయ్యే ఆస్ట్రేలియా టీ20 సిరీస్‌కు ముందు రింకూ అద్భుతమైన ఫామ్‌ను భారత క్రికెట్ మేనేజ్‌మెంట్‌కు స్పష్టంగా చాటి చెబుతోంది.మొదట బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు 470 పరుగుల భారీ స్కోరు సాధించింది.



దీనికి బదులివ్వడంలో యూపీకి దారుణమైన ప్రారంభం లభించింది. ఒకానొక దశలో యూపీ జట్టు కేవలం 178 పరుగులకే ఐదు కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. ఇలాంటి అత్యంత క్లిష్టమైన సమయంలో ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన రింకూ సింగ్ ఓపికతో, పట్టుదలతో క్రీజులో నిలబడ్డాడు. రింకూ సింగ్ దాదాపు 260కి పైగా బంతులు ఎదుర్కొని ఆంధ్ర బౌలర్ల వ్యూహాలను చిత్తు చేశాడు. రింకూ ఈ ఇన్నింగ్స్ కేవలం భారీ షాట్లకే పరిమితం కాకుండా, వికెట్‌ను కాపాడుకోవడానికి, జట్టును పతనం నుంచి




నిలబెట్టడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చింది.రింకూ సింగ్‌కు మరో యువ ఆటగాడు విప్రజ్ నిగమ్ (42 పరుగులు) నుంచి అద్భుతమైన సహకారం లభించింది. వీరిద్దరూ కలిసి ఏడో వికెట్ కోసం 122 పరుగుల అత్యంత ముఖ్యమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ విలువైన భాగస్వామ్యం కారణంగానే ఉత్తరప్రదేశ్ జట్టు చివరికి 450 పరుగుల మార్కును దాటగలిగింది. మ్యాచ్‌లో తమ పోరాటాన్ని కొనసాగించగలిగింది. ఈ సెంచరీతో రింకూ సింగ్ తన ఫస్ట్-క్లాస్ క్రికెట్ కెరీర్‌లో 3400 కంటే ఎక్కువ పరుగులు పూర్తి చేసుకున్నాడు. అతని సగటు 55 కంటే ఎక్కువగా ఉంది. ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో ఇది అతని 8వ సెంచరీ కావడం విశేషం. రింకూ సింగ్ 22 అర్ధ సెంచరీలు కూడా నమోదు చేశాడు. ఈ ఇన్నింగ్స్ ఆడిన సమయం టీమిండియాకు చాలా అనుకూలంగా ఉంది. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా గాయం కారణంగా జట్టుకు అందుబాటులో లేకపోవడంతో, జట్టుకు ఒక నమ్మకమైన 'ఫినిషర్' అవసరం ఉంది. ఇలాంటి కీలక సమయంలో రింకూ సింగ్ దేశీయ క్రికెట్‌లో చూపిన ఈ అద్భుతమైన ప్రదర్శన, టీమ్ మేనేజ్‌మెంట్‌కు గొప్ప భరోసా ఇచ్చింది. రింకూ ఇప్పుడున్న ఫామ్ చూస్తుంటే, ఆస్ట్రేలియా జట్టు రాబోయే టీ20 సిరీస్‌లో అతన్ని ఎదుర్కోవడానికి కచ్చితంగా ప్రణాళికలు మార్చుకోవాల్సి వస్తుంది.



## క్రికెట్ ప్రపంచంలో చీకటి రోజు

### పాకిస్తాన్‌పై రషీద్ ఖాన్ నిప్పులు!

పాకిస్తాన్ సైన్యం ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దులో జరిపిన అమానుష వైమానిక దాడుల్లో ముగ్గురు యువ క్రికెటర్లు ప్రాణాలు కోల్పోవడంతో ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ ప్రపంచం శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ ఘటనపై ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ కెప్టెన్ రషీద్ ఖాన్ తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్తాన్ చర్యను పూర్తిగా అనైతికంగా, అమానుషంగా ఆయన అభివర్ణించారు.పాకిస్తాన్ సరిహద్దు వెంబడి జరిగిన వైమానిక దాడుల్లో పౌరులు, ముఖ్యంగా ముగ్గురు యువ క్రికెటర్లు మరణించిన నేపథ్యంలో ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు సంచలన నిర్ణయం తీసుకుంది. మృతుల కుటుంబాలకు సంతాపం తెలుపుతూ.. వచ్చే నెలలో పాకిస్తాన్, శ్రీలంకతో కలిసి జరగాల్సిన ట్రై-సిరీస్ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించింది. ఈ ఘటన నేపథ్యంలో నవంబర్ 5 నుంచి 29 వరకు లాహోర్, రావల్పిండిలలో జరగాల్సిన ఈ ట్రై-సిరీస్ ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు నిర్ణయంతో అనిశ్చితిలో పడింది. ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు ఈ దాడిని పాకిస్తాన్ ప్రభుత్వం చేసిన పిరికిపంద దాడిగా తీవ్రంగా ఖండించింది.ఈ దారుణం ఆఫ్ఘనిస్తాన్‌లోని పక్టికా ప్రావిన్స్‌లోని పౌర నివాసాలపై జరిగిన దాడుల్లో చోటుచేసుకుంది. మరణించిన ఆ ముగ్గురు యువ ఆటగాళ్లను కబీర్, సిబ్‌గతుల్లా, హారూన్‌గా గుర్తించారు. ఈ యువ క్రికెటర్లు పాకిస్తాన్ సరిహద్దుకు



సమీపంలోని తూర్పు పక్టికా ప్రావిన్స్, ఉరుగున్ నుంచి షార్నా వరకు ఒక ఫ్రెండ్లీ మ్యాచ్‌లో పాల్గొని ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో, ఉరుగున్‌లో జరుగుతున్న ఓ సభను పాకిస్తాన్ సైన్యం లక్ష్యంగా చేసుకుంది. ఈ దాడిలో ఆ ముగ్గురు క్రికెటర్లతో పాటు మరో 5గురు పౌరులు కూడా మరణించారు. ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు దీనిని ఆఫ్ఘన్ క్రీడా సమాజానికి దాని ఆటగాళ్లకు, క్రికెట్ కుటుంబానికి తీరని నష్టంగా పేర్కొంది.48 గంటల కాల్పుల విరమణ తర్వాత మళ్లీ



ప్రారంభమైన ఈ పోరాటం.. రెండు వైపులా చాలా మంది ప్రాణాలు కోల్పోవడానికి కారణమైంది. పాకిస్తాన్ వైమానిక దాడుల్లో పక్టికా ప్రావిన్స్‌లోని అర్గున్, బర్మల్ జిల్లాలోని నివాస ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంది. సంక్షోభాన్ని తగ్గించడానికి రెండు దేశాల ప్రతినిధులు దోహాలో చర్చలు జరుపుతున్నప్పటికీ.. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఈ దాడులు కాల్పుల



విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించాయని తాలిబాన్ తీవ్రంగా ఆరోపించింది.ఆఫ్ఘనిస్తాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ సోషల్ మీడియా ద్వారా తన తీవ్ర దుఃఖాన్ని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆయన ప్రకటనలో పౌరులు, మహిళలు, పిల్లలు, దేశానికి ప్రాతినిధ్యం వహించాలని కలలు కంటున్న యువ క్రికెటర్లు ప్రాణాలు కోల్పోవడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం పూర్తిగా అనైతికం, అమానుషం. ఈ అన్యాయమైన, చట్టవిరుద్ధమైన చర్యలు మానవ హక్కులను తీవ్రంగా ఉల్లంఘించాయి. వీటిని విస్మరించకూడదు." అని రషీద్ ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్తాన్ దాడులను తీవ్రంగా విమర్శించిన రషీద్ ఖాన్.. ఈ మానవ హక్కుల తీవ్ర ఉల్లంఘనలను అంతర్జాతీయ వేదికపై లేవనెత్తాలని డిమాండ్ చేశారు. అమాయక ప్రాణాలు కోల్పోవడానికి కారణమైనందుకు, రాబోయే మ్యాచ్‌ల నుండి వైదొలగాలని ఆఫ్ఘన్ క్రికెట్ బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని తాను పూర్తిగా స్వాగతిస్తున్నట్లు రషీద్ ఖాన్ సమర్థించారు. "ఈ కష్ట సమయంలో నేను నా ప్రజలకు అండగా ఉంటాను. మా జాతీయ గౌరవం ముందు ఉండాలి" అని ఆయన ప్రకటించారు. ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని కెప్టెన్ రషీద్ ఖాన్ సమర్థించడంతో, అంతర్జాతీయ క్రికెట్ వేదికపై పాకిస్తాన్-ఆఫ్ఘనిస్తాన్ సంబంధాలు మరింత ఉద్రిక్తంగా మారే అవకాశం ఉంది.

# బంగాళా ఖాతంలో అల్పపీడనం

## తెలంగాణలో ఐదురోజులు మోస్తరు వర్షాలు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

తెలంగాణలో రాగల ఐదురోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ హెచ్చరించింది. నైరుతి బంగాళాఖాతం ప్రాంతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఇవాళ ఉదయం అల్పపీడనంగా మారిందని పేర్కొంది. పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ బుధవారం మధ్యాహ్నం నాటికి ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలకు ఆనుకొని ఉన్న నైరుతి, పశ్చిమ వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే ఛాన్స్ ఉందని చెప్పింది. ఆ తర్వాత పశ్చిమ–వాయువ్య దిశగా కదిలి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర వైపు కదులుతూ 24గంటల్లో మరింత బలపడే అవకాశాలున్నాయని తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణలో ఐదురోజులు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. బుధవారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. గురువారం ఖమ్మం, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పింది. గురువారం, శుక్రవారాల్లో నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని.. కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో భారీ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణశాఖ వివరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. గడిచిన 24గంటల్లో రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, జనగాం, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాలతో పాటు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయని టీజీడీపీఎస్ వివరించింది.

# బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి నామినేషన్

### కిషన్ రెడ్డి, రామచంద్రరావుతో కలసి వచ్చిన దీపక్

### ముగిసిన నామినేషన్ల పర్వం

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి



జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం భాజపా అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. తొలుత వెంకటగిరిలోని విజయదుర్గ పోచమ్మ ఆలయంలో దీపక్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా షేక్‌పేట తహాశీల్దార్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ వేశారు. 2023 ఎన్నికల్లోనూ



దీపక్‌రెడ్డి జూబ్లీహిల్స్ భాజపా అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నామినేషన్లకు చివరి రోజు కావడంతో అతను నామినేషన్ వేశారు.. మంగళవారం సాయంత్రంతో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నామినేషన్ల గడువు ముగిసింది. ఉప ఎన్నికల్లో పోటీకి చివరిరోజులు పెద్ద ఎత్తున అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. 150కిపైగా నామినేషన్లు దాఖలవగా.. అభ్యర్థుల సంఖ్య 100 మార్క్‌ని దాటింది. మూడు గంటల తర్వాత గేటు లోపల ఉన్న వారికి మాత్రమే అధికారులు నామినేషన్లు వేసేందుకు అవకాశం కల్పించారు. ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు భారీగా నామినేషన్స్ వేశారు. ఆర్ఆర్ఆర్ బాధిత రైతులు, ఓయూ నిరుద్యోగ వికాస నాయకులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల చివరిరోజున బీజేపీ తరఫున లంకల దీపక్‌రెడ్డి సైతం ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఇప్పటికే బీఆర్ఎస్ తరఫున మాగంటి సునీత, కాంగ్రెస్ తరఫున నవీన్ యాదవ్ నామినేషన్లు వేశారు. రేపటి నుంచి నామినేషన్లను రిటర్నింగ్ అధికారి సాయిరాం పరిశీలించనున్నారు. ఇక 24న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉన్నది. నవంబర్ 11న జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరుగనుండగా.. 14న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటించనున్నారు.

# ప్రమోద్ కుటుంబానికి అండగా ఉంటాం

### బాధిత కుటుంబానికి డిజిపి పరామర్శ

### అంకితభావంతో పనిచేసే పోలీసును కోల్పోయాం

### రియాజ్ ఎ న్‌కౌంటర్‌పై విచారణ

### ఆస్పత్రిలో గాయపడ్డ ఆసిఫ్‌కు పరామర్శ

నిజామాబాద్, అక్షరకలం ప్రతినిధి

ఇటీవల విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుమార్ కుటుంబానికి అండగా ఉంటామని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్‌లోని కానిస్టేబుల్ ఇంటికి వచ్చిన డీజీపీ, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పలువురు ఉన్నతాధికారులు.. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మీడియా సమావేశంలో డీజీపీ మాట్లాడారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే ఒక మంచి కానిస్టేబుల్‌ను కోల్పోయామన్నారు. ఇది పోలీస్ శాఖను తీవ్రకలవరానికి గురి చేసిందన్నారు. రియాజ్ ఎన్‌కౌంటర్ ఘటనపై విచారణ జరుగుతోంది. విచారణ జరుగుతున్నప్పుడు కేసు గురించి మాట్లాడితే దర్యాప్తు అధికారిని ప్రభావితం చేసినట్లు అవుతుంది. ప్రమోద్ కుటుంబానికి రూ.కోటి పరిహారం, సెప్టెంబరు నెల వేతనం ఎంత తీసుకున్నారో ఆ మొత్తాన్ని పదవీ విరమణ తేదీ వరకు ప్రతినెలా ఆయన కుటుంబానికి అందించాలని, 300 గజాల ఇంటి స్థలం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, పోలీసు భద్రత, వెల్ఫేర్ బోర్డుల నుంచి రూ.24 లక్షల పరిహారం, పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. నిజామాబాద్‌లో ఇటీవల చోటుచేసుకున్న సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ హత్య కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.

# విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి...

### సోషల్ వెల్ఫేర్ మంత్రి ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్:

### మంత్రి అడ్లూరి చేతుల మీదుగా గ్రూప్ 2 అభ్యర్థులకు ఏఎస్ డబ్ల్యూ ఓ లుగా నియామకపత్రాలు అందజేత...

హైదరాబాద్, అక్టోబర్ 21,




( అక్షర కలం): బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ఏకైక లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని, సీఎం అవలంబిస్తున్న ఫ్రెండ్లీ గవర్నమెంట్ పరిపాలనకు అనుగుణంగా ఉద్యోగులు పని చేయాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. గ్రూప్ 2 పోటీ పరీక్షల్లో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారులుగా నియమితులైన అభ్యర్థులకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ లోని ఎస్సీ డెవలప్మెంట్ అభివృద్ధి శాఖ మంత్రి కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టాక వేలాది మంది కి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని, ముఖ్యమంత్రి విజన్ ఉన్న నాయకుడని తదనుగుణంగా అధికారులు పనిచేయాలని గ్రామీణ ప్రాంతాలలో చదువుకుంటున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంక్షేమ కోసం క్రమశిక్షణతో పనిచేసే మంచి పేరు తెచ్చుకోవాలని మంత్రి సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఎన్నో వ్యయప్రయాసాల కోర్చి శ్రమిస్తే మీరు ఈ స్థాయికి వచ్చారని, మంచి పాలన అందించి ప్రభుత్వానికి, వారి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని మంత్రి అన్నారు. హాస్టల్ విద్యార్థులకు మంచి చదువుని ఇచ్చి మంచి భవిష్యత్తును ఇవ్వాలని మంత్రి కోరారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ మంత్రి లక్ష్మణ్ కుమార్ చొరవ తో గత ప్రభుత్వంలో పెండింగ్ లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కీం (బిఏఎస్) పథకానికి సంబంధించిన 25 శాతం నిధులను ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లి ఇప్పించారని అభినందించారు. హాస్టల్ విద్యార్థులకు 40% చార్జీలను 200 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కుతుందని, సహకరించిన మల్లు భట్టి విక్రమార్కకు, మంత్రి లక్ష్మణ్ కుమార్ కు ధన్యవాదాలు తెలిపారు.మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ ఏఎస్డబ్ల్యూఓ అధికారులకు అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో ఎస్సిడిడి సెక్రెటరీ డాక్టర్ బుద్ధ ప్రకాశ్ జ్యోతి, ఎస్సిడిడి స్పెషల్ చీఫ్ సెక్రటరీ సభ్యసాచి గోష్, అడిషనల్ డైరక్టర్ సి.శ్రీధర్, బి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# హాస్టళ్లలో "ఎఫ్ఆర్ఎస్"

### దుమ్మాలకు చెక్ పెట్టేందుకే అమలు

### ఇక పక్కాగా తేలనున్న హాజరు లెక్క

### నల్లగొండ జిల్లాలో 60 ఎస్సీ, 43 ఎస్టి, 46 బీసీ హాస్టల్లు

### వసతి పొందుతున్న 17 వేలకు పైగా విద్యార్థులు

అక్షరకలం నల్గొండ

సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు, సిబ్బందికి ఫేషియల్ రికగ్నిషన్ విధానాన్ని(ఎఫ్ఆర్ ఎస్) అమలులోకి తెచ్చేందుకు ప్రభుత్వం నిర్ణ యించింది. ఇప్పటికే పాఠశాలలు, కళాశాలల్లో బోధన, బోధనేతరులు, విద్యార్థులకు ఈ విధానం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు, సిబ్బంది హాజరు నిజ సమయంలో ట్రాక్ చేయటా నికి, అవకతవకలకు అడ్డుకట్టవేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ విధానంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్ల విద్యార్థుల ఫొటోలు తీసి, ఆధార్, ఫోన్ నంబర్, చిరునామా, తరగతి తదితర వివరాలు యాప్లో అప్లోడ్ చేయనున్నారు. యాప్లోని మొబైల్ ఫోన్ పరికరాల్లో విద్యార్థి ముఖం చూపిస్తే హాజరు నమోదవుతుంది. ఏరోజు ఎంతమంది విద్యార్థులున్నారు?.. మిగతావారు ఎందుకు రాలేదు.? హాజరు సంబంధ సమాచారంతోపాటు హాస్టల్ సంక్షేమ అధికారుల అలసత్వం, నిర్వహణ లోపాలు తెలవనున్నాయి. తద్వారా అధికారులు చర్యలు చేపట్టే అవకాశముంది. ఈ విధానంతో బోగస్ హాజరుకూ చెక్ పడనుంది.

### కొరవడిన పర్యవేక్షణ...

సంక్షేమ హాస్టళ్లలో పర్యవేక్షణ కొరవడడంతో నిర్వహణ




ఇష్టారాజ్యంగా మారింది. సాంకేతికతో ముందుకు వెళ్తున్న తరుణంలో (ఆన్లైన్ హాజరు అమలులోకి ఉన్నప్పటికీ) పాత పద్ధతితో (మాన్యువల్ రిజిస్టర్) సరిపెడుతున్నారు. దీంతో ఎంత మంది విద్యార్థులు వసతిగృహాల్లో ఉంటున్నారు?.. ఎంత మంది బయటకు వెళ్లారో లెక్క తేలడం లేదు. వస తిగృహాల్లో విద్యార్థులు తక్కువగా ఉన్నా.. ఎక్కువ చూపుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

### జిల్లాలో హాస్టల్లు...

నల్లగొండ జిల్లాలో ఎస్సీ ప్రీమెట్రిక్ వసతి గృహాలు 45, పోస్టుమెట్రిక్ 15 వసతి గృహాలు ఉన్నాయి. ప్రీమెట్రిక్ 1100 మంది, పోస్టుమెట్రిక్ లో 3484 మంది వరకు విద్యార్థులున్నారు. బీసీ ప్రీ మెట్రిక్ 25, పోస్టు మెట్రిక్ 21 వసతిగృహాల్లో సుమారు 4800 మంది విద్యారులుంటున్నారు. 16 ఎస్టీ ఆశ్రమ పాఠశాల్లో 2,600 మంది విద్యార్థులున్నారు. ఎస్టీ సంక్షేమ హాస్టళ్లలకు సంబంధించి 32 ప్రీ మెట్రి కు 11 పోస్టు మెట్రిక్ హాస్టల్ లు ఉండగా ప్రీ మెట్రిక్ లో 6474 మంది, పోస్ట్ మెట్రిక్ లో సుమారు 1100 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. అయితే హాస్టల్లో బయోమెట్రిక్ అమల్లో ఉన్న సాంకేతిక సమస్యల వల్ల అమలు కావటం లేదు. దీంతో విద్యార్థుల హాజరుపై పర్యవేక్షణ లేకుండా పోతోంది.

### లెక్క పక్కాగా..

ఎఫ్ఆర్ఎస్ అమలులోకి వస్తే వసతిగృహాల్లో సంక్షేమాధికారులు, సిబ్బంది విధులకు దుమ్మా కొట్టేందుకు ఆస్కారముండదు. నల్గొండ జిల్లాలో కొంతమంది వసతిగృహాల అధికారులు స్థానికంగా ఉండడంలేదు. వీలు దొరికనప్పు డల్లా వసతిగృహాలకు చుట్టపుచూపుగా వెళ్లిరావటం.. కింది స్థాయి సిబ్బందితో పనులు చక్కబెట్టుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇదివరకు నిఘా కెమెరాలు ఏర్పాటు చేసినా నిర్వహణ లేక కొన్ని వసతి గృహాలలో మూలన పడ్డాయి. కళాశాలలో మాదిరిగా ప్రభుత్వ వసతిగృహ విద్యార్థులకు భద్రత, సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా నిఘా నేత్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఎఫ్ ఆర్ ఎస్ ద్వారా విద్యార్థుల సంఖ్య, భోజన సమయంలో హాజరు, వస తిగృహ అధికారులు, సిబ్బంది ఎఫ్ ఆర్ ఎస్ ముందు నిలబడితే తెలిసిపోనుంది. భోజనంలో అవకతవకలు, విద్యార్థుల లెక్కల్లో తికమకకు తెరపడనుంది.

### అతి త్వరలోనే అమల్లోకి...

ఇదే విషయంపై జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శశికళను సంప్రదించగా పలు విషయాలను వెల్లడించారు. గత సెప్టెంబర్ 4వ తేదీన కమిషనరేట్ లో సంక్షేమ శాఖల జిల్లా అధికారులు, వసతి గృహాధికారులకు ఎఫ్ ఆర్ ఎస్ పై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఇప్పటికే రంగారెడ్డి జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఎఫ్ ఆర్ ఎస్ అమలవుతుంది. ప్రభుత్వ ఆదేశాలు రాగానే జిల్లాలో కూడా ఎఫ్ఆర్ఎస్ అమలవుతుందని తెలిపారు.

# అంత్యక్రియలకు వెళ్లి మృత్యు ఒడిలోకి..!

### మంజీరలో స్నానానికి వెళ్ళి ఇద్దరు మృతి

### మృతుల్లో పదవ తరగతి విద్యార్థి

### అందురు చూస్తుండగానే ప్రమాదం

### పేరూర్ లో విషాదం...

మెదక్, అక్టోబర్ 21 (అక్షర కలం ):-

మహిళా అంత్యక్రియలకు వెళ్ళి.. మంజీరలో స్నానం చేసేందుకు ఇద్దరు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన మెదక్ మండలం పేరూర్ లో మంగళ వారం జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు పేరూర్ కు చెందిన చింతకింది అంజమ్మ మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు మంగళ వారం మధ్యాహ్నం నిర్వహించారు. గ్రామ శివారులో ఉన్న స్మశాన వాటిక వద్ద అంత్యక్రియలు నిర్వహించగా అక్కడే ఉన్న మంజీరా నదిలో స్నానం చేసేందుకు పదవ తరగతి విద్యార్థి హరి కృష్ణ (16)తో పాటు అదే గ్రామానికి చెందిన చింతకింది భీమయ్య(48)ఇద్దరు కలిసి వెళ్ళారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల మూలంగా నదిలో పుష్కలంగా నీరు చేరింది. నీటి లోటు గ్రహించిన ఇద్దరు నది మద్యలోకి వెళ్లి స్నానం చేందుకు వెళ్ళారు. అక్కడ లోతుగా గుంతలు ఉండడం తో అందులో మునిగిపోయారు. నది మద్యలోకి వెళ్ళడం మూలంగా ప్రమాదం జరిగిన వెంటనే ఎక్కడికి వెళ్లేందుకు అక్కడే ఉన్నవారికి సాద్యం కాలేదు. దీనితో ఊపిరాడక ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. అంత్యక్రియలు వెళ్లి అందరితో కలిసి స్నానం చేసి ఉంటే ప్రమాదం జరిగేది కాదని మృతుడి కుటుంబుకులు భోరున విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను ఒడ్డుకు తీసి పోస్టుమార్థం కోసం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి



తరలించారు. బాదితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని తెలిపారు.

నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన మెదక్ మండలం పేరూర్ లో మంగళ వారం జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు పేరూర్ కు చెందిన చింతకింది అంజమ్మ మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు మంగళ వారం మధ్యాహ్నం నిర్వహించారు. గ్రామ శివారులో ఉన్న స్మశాన వాటిక వద్ద అంత్యక్రియలు నిర్వహించగా అక్కడే ఉన్న మంజీరా నదిలో స్నానం చేసేందుకు పదవ తరగతి విద్యార్థి హరి కృష్ణ (16)తో పాటు అదే గ్రామానికి చెందిన చింతకింది భీమయ్య(48)ఇద్దరు కలిసి వెళ్ళారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల మూలంగా నదిలో పుష్కలంగా నీరు చేరింది. నీటి లోటు గ్రహించిన ఇద్దరు నది మద్యలోకి వెళ్లి స్నానం చేందుకు వెళ్ళారు. అక్కడ లోతుగా గుంతలు ఉండడం తో అందులో మునిగిపోయారు. నది మద్యలోకి వెళ్ళడం మూలంగా ప్రమాదం జరిగిన వెంటనే ఎక్కడికి వెళ్లేందుకు అక్కడే ఉన్నవారికి సాద్యం కాలేదు. దీనితో ఊపిరాడక ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. అంత్యక్రియలు వెళ్లి అందరితో కలిసి స్నానం చేసి ఉంటే ప్రమాదం జరిగేది కాదని మృతుడి కుటుంబుకులు భోరున విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను ఒడ్డుకు తీసి పోస్టుమార్థం కోసం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు



అక్షరకలం
తెలుగు దినపత్రిక




# చిరు ఇంట్లో నాగ్, వెంకటేశ్.. దీపావళి పార్టీ

దీపావళి పండుగ వేళ తెలుగు చిత్రసీమలోని స్టార్లు ఒక్కచోట చేరారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో దివాళి పార్టీ నిర్వహించిన చిరంజీవి సహ నటులను ఆహ్వానించారు. మెగాస్టార్ పిలుపునందుకున్న టాలీవుడ్ స్టార్లు విక్టరీ వెంకటేశ్, అక్కినేని నాగార్జున కుటుంబ సమేతంగా చిరు ఇంటికి వెళ్లారు. 'మన శంకర వరప్రసాద గారు' చిత్రంలో నటిస్తున్న నయనతార కూడా పార్టీకి హాజరైంది. తన నివాసానికి దీపావళి పార్టీకి వచ్చిన నాగ్, విక్టరీ వెంకీలతో పాటు నయన్‌కు చిరు, ఆయన సతీమణి సురేఖ సాదరంగా ఆహ్వానం పలికారు. సూపర్ స్టార్లంతా ఒక చోట చేరడంతో పండుగసంబురం అంబరాన్నంటింది. ప్రస్తుతం చిరుఇంట్లో జరిగిన పార్టీ సందర్భంగా.. నాగార్జున, వెంకటేశ్, నయన్‌తారలతో చిరంజీవి దిగిన ఫొటోలు నెట్టింట వైరలవుతున్నాయి.

# పతంగ్ ఎగిరేది అప్పుడే.. రిలీజ్ టైం ఫిక్స్ చేసిన మేకర్స్

ఇప్పటి వరకు ఎన్నో స్పోర్ట్స్ డ్రామాలు ప్రేక్షకులు చూసి వుంటారు. కాని అందరిలో ఎంతో మమేకమైన పతంగుల పోటీతో రాబోతున్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'. సినిమాటిక్ ఎలిమెంట్స్ అండ్ రిషన్ సినిమాస్ పతాకంపై విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి, నాని బండ్రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో ఇన్‌స్టాగ్రామ్ సెన్సేషన్ ప్రీతి పగడాల, జీ సరిగమప రన్నరప్ ప్రణవ్ కౌశిక్‌తోపాటు వంశీ పూజిత్ ముఖ్యతారలుగా నటిస్తున్నారు.






# యూత్‌ఫుల్ యుఫోరియా

నూతన నటీనటులతో అగ్ర దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కిస్తున్న యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'యుఫోరియా'. భూమిక చావ్లా, సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేష్ గవిరెడ్డి, లిఖిత యలమంచిలి, అడ్డాల పృథ్వీరాజ్, కల్పలత, సాయిశ్రీనికా రెడ్డి, అశ్రిత వేముగంటి, మాథ్యూ వర్గీస్, ఆదర్శ్ బాలకృష్ణ, రవి ప్రకాశ్, నవీనారెడ్డి, లికిత్ నాయుడు ముఖ్య పాత్రధారులు. ఇప్పటికే ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించిందని మేకర్స్ చెబుతున్నారు.డిసెంబర్ 25న సినిమా విడుదల కానున్నదని తెలియజేస్తూ రిలీజ్ డేట్ పోస్టర్‌ని దీపావళి పండుగ సందర్భంగా మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ఓవైపు భూమిక నవ్వుతూ కనిపిస్తున్నది. మరోవైపు పిల్లాడితో ఆడుతూ కనిపిస్తున్నది. ఇది అన్ని వర్గాల ప్రేక్షకులకూ నచ్చే సినిమా అని, ఇందులో వినోదంతోపాటు చక్కని సందేశం కూడా ఉంటుందని గుణశేఖర్ తెలిపారు.

# రైల్వే ప్లాట్‌ఫాంపై సంయుక్తా మీనన్ ఊచకోత..



భీమ్లా నాయక్ ఫేం మలయాళ బ్యూటీ సంయుక్తా మీనన్ తొలిసారి హీరోయిన్ సెంట్రిక్ సినిమాతో వస్తోన్న విషయం తెలిసిందే. యోగేశ్ కేఎంసీ డైరెక్ట్ చేస్తున్నాడు. షూటింగ్ కొనసాగుతున్న ఈ చిత్రానికి ఇప్పటికే బ్లాక్ గోల్డ్ టైటిల్‌ను ఫిక్స్ చేసినట్టు తెలియజేస్తూ లుక్ విడుదల చేశారు.ముందుగా ప్రకటించిన ప్రకారం బ్లాక్ గోల్డ్ ఫస్ట్‌లుక్ విడుదల చేశారు మేకర్స్. ప్రయాణికులెవరూ లేని రైల్వే ప్లాట్ ఫాంపై సంయుక్తా మీనన్ రౌడీ మూకలను ఊచకోత కోసినట్టు కనిపిస్తున్న పోస్టర్ సినిమా చూసిన ప్రేక్షకులకు రోమాలు నిక్కపొడుచుకోవడం ఖాయమని చెప్పకనే చెబుతోంది.బొగ్గు షేడ్స్ బ్యాక్ డ్రాప్‌లో రాళ్లతో డిజైన్ చేసినట్టుగా ఉన్న టైటిల్ లుక్ మధ్యలో నాట్యం చేస్తున్న ప్రతిమ కనిపిస్తుంది. మొత్తానికి ఈ సినిమా నల్లబంగారం (బొగ్గు)చుట్టూ తిరుగుతుందని డైరెక్టర్ హింట్ ఇచ్చినట్టు టైటిల్ లుక్ చెప్పకనే చెబుతోంది. ఈ మూవీని హాస్య మూవీస్, మాగంటి పిక్చర్స్ బ్యానర్లపై సంయుక్తంగా రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి శ్యామ్ సీఎస్ మ్యూజిక్ అందిస్తున్నాడు.





# డోంట్ ట్రబుల్ ది ట్రబుల్

మలయాళ విలక్షణ నటుడు ఫాహద్ ఫాజిల్ హీరోగా రూపొందుతున్న ప్రతిష్టాత్మక థ్రిల్లర్ ఫాంటసీ ఎంటైర్టైనర్ 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. శశాంక్ యేలేటి దర్శకుడు. ఆర్కా మీడియా వర్క్స్, షోయింగ్ బిజినెస్ పతాకాలపై శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్.ఎస్.కార్తికేయ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఆదివారం మొదలైంది.ఫాహద్ ఫాజిల్ షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా ఈ సినిమా ప్రకటనను విడుదల చేస్తూ.. ఫాహద్ ఫాజిల్, దర్శకుడు శశాంక్, నిర్మాత ఎస్.ఎస్.కార్తికేయ సెట్‌లో ఉన్న స్టిల్స్‌ని మేకర్స్ మీడియాకు షేర్ చేశారు. నవంబర్ 8 వరకూ ఈ షెడ్యూల్ ఉంటుందనీ, ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తామని, వచ్చే ఏడాది ద్వితీయార్థంలో సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: కాలభైరవ.

# జిల్లా కలెక్టర్ కు దీపావళి పండుగ శుభాకాంక్షలు

**టిజిఈజేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి**



**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 21:**

టీఎన్జీవో జిల్లా కార్యవర్గ సభ్యులు, అన్ని యూనిట్ల అధ్యక్ష కార్యదర్శులు, ప్రాథమిక సభ్యులు, జిల్లా సంక్షేమ వసతి గృహ అధికారుల సంఘం నాయకులు మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత కార్యాలయ సముదాయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేసినట్లు టిజిఈజేఏసీ జిల్లా చైర్మన్, టిఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవోస్ యూనియన్ జిల్లా కోశాధికారి ఏ సతీష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు రామ్ కుమార్, తిరుపతి, జాయింట్ కార్యదర్శి సురేందర్, పబ్లిక్ కార్యదర్శి యూసుఫ్, రాజేందర్, మంచిర్యాల యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు గోపాల్, అజయ్ ప్రశాంత్, బెల్లంపల్లి యూనిట్ అధ్యక్షుడు వెంకటేష్, సభ్యులు గంగారం, సంజీత్ రావు, జిల్లా వసతి గృహాల సంక్షేమ అధికారుల సంఘం అధ్యక్షుడు మోహ్సిన్, కార్యవర్గ సభ్యులు ధర్మానంద్ గౌడ్, కుమార్, సునీత లు పాల్గొన్నారు.

# జాబ్ మేళాకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలి






## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట అక్షర కలం/ ప్రతినిధి :**

ఈ నెల 25 న నిర్వహించే జాబ్ మేళా ఏర్పాట్ల పై అధికారులతో మంగళవారం హుజూర్నగర్ పట్టణంలోని పెర్ల్ ఇన్ఫినిటీ ఇన్ఫినిటీ ఇంటర్ నేషనల్ స్కూల్ లో జిల్లా ఎస్పి కే నరసింహ తో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కోదాడ, మిర్యాలగూడ మెయిన్ రోడ్డు నుండి అప్రోచ్ రోడ్లను జాబ్ మేళా ప్రాంగణానికి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని మెయిన్ రోడ్ నుండి నడవటానికి వీలుగా ఉండేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ కి సూచించారు.స్వర్ణ వేదిక ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ కౌంటర్స్ ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తదుపరి పెర్ల్ ఇన్ఫినిటీ ఇంటర్ నేషనల్ స్కూల్ లో కంపెనీల స్టాల్స్ వద్దకు రావాలని ఒక్కొక్కరు 5 కంపెనీ ల ఇంటర్వ్యూ కు హాజరు అయ్యేందుకు అవకాశం ఉంటుందని ప్రతి ఒక్కరు 5 రెస్యూమ్ లు తమ వెంట తీసుకొనిరావాలని సూచించారు. కంపెనీ స్టాల్స్ వద్ద అభ్యర్థులు వెయిటింగ్ చేయుటకు కుర్చీలు ఏర్పాటు చేయాలని తెలిపారు.స్వర్ణ వేదిక పంక్షన్ హాల్ లో రిజిస్ట్రేషన్ కౌంటర్ లు, ప్రక్కన ఉన్న బహిరంగ స్థలంలో టిఫిన్, భోజనం ఏర్పాటు చేశామని అక్కడ అన్ని వసతులు ఏర్పాటు చేయాలని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ ను ఆదేశించారు. కంపెనీ నిర్వాహకులకు, వాలంటీర్లుకు ఐ డి కార్డులు జారీ చేయాలని, అభ్యర్థుల కొరకు, జిరాక్స్ సెంటర్లు ఏర్పాటు చేయాలని అన్నారు.ఐ టి, ఫార్మా, బ్యాంకింగ్, ఇండస్ట్రీస్ రంగాల వారీగా అభ్యర్డులు ఆందోళన పడకుండా ఎవరు దేనికి అర్హత ఉన్నారో రిజిస్ట్రేషన్ కౌంటర్ దగ్గరే తెలియజేయాలనీ నిర్వాహకులకు సూచించారు.జిల్లా ఎస్ పి కే నరసింహ మాట్లాడుతూ గ్రామ పోలీస్ ల సహకారం తో జాబ్ మేళా పై ప్రచారం చేపించి వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ సమావేశముకు డి ఈ ఈ ట్ ప్రకతినిధి వంశీ, సింగరేణి ప్రతినిధి చందర్,ఆర్డీఓ లు శ్రీనివాసులు, సూర్యనారాయణ, జిల్లా ఉపాధి కల్పనా అధికారి శంకర్,జీ ఎం ఇండస్ట్రీస్ సీతారాం నాయక్,డి పి ఓ యాదగిరి,డి ఈ ఓ అశోక్, డి ఐ ఈ ఓ భాను నాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, అధికారులు, తదితరులు హాజరయ్యారు.

# జిల్లాస్థాయి యోగా పోటీల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక**




**అక్షర కలం, మందమర్రి అక్టోబర్ 21:**

స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ (ఎస్జిఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి యోగా పోటీల్లో పట్టణానికి చెందిన ప్రభుత్వ ఆదర్శ (మోడల్) పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి, పలు బహుమతులు గెలుపొందడంతో పాటు జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైయ్యారని పాఠశాల ప్రిన్సిపల్ సారా తస్మీన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల ఇంధనపల్లి లో నిర్వహించిన అండర్ 14, 17 బాలబాలికల యోగా జిల్లా ఎంపిక పోటీల్లో జిల్లాకు చెందిన పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా, పట్టణానికి చెందిన ప్రభుత్వ ఆదర్శ (మోడల్) పాఠశాల విద్యార్థులు పాల్గొని, మంచి ప్రతిభను కనబరిచారని తెలిపారు. రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన సమీక్ష యోగా అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన పాఠశాల విద్యార్థి బి అక్షయ అండర్ 17 ఆర్టిస్ట్ సింగిల్ విభాగంలో ప్రథమ స్థానం, ట్రెడిషనల్ విభాగంలో ప్రథమ స్థానం పొందగా, బి సాయి అండర్ 14 ఆర్టిస్ట్ సింగిల్ విభాగంలో ప్రథమ స్థానం, ట్రెడిషనల్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించగా, టి అభిజ్ఞ అండర్ 14 ఆర్టిస్ట్ పెయిర్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించి, జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, యోగా కోచ్ సమీక్ష అకాడమీ చైర్ పర్సన్ ఈ మెర్సీ రాణి లను పాఠశాల ప్రిన్సిపాల్ సారా తస్మీన్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు.

# తెలంగాణ రైజింగ్ విజన్ - 2047 సర్వేలో భాగస్వాములు కావాలి

**అక్షర కలం/నారాయణపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్: 21.**



తెలంగాణ రాష్ట్రాన్ని రానున్న రోజులలో అభివృద్ధి, సంక్షేమ రంగాలలో అగ్రగామిగా నిలిపేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్ విజన్ - 2047" అంశాలతో డాక్యుమెంటును రూపొందిస్తున్నదని, ఈ సర్వేలో ఉద్యోగులు, అన్ని వర్గాల వారు భాగస్వాములు కావాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందిస్తున్న ఈ విజన్ 2047 డాక్యుమెంట్ తయారీలో ప్రతి ఒక్క పౌరుడు పాల్గొనేలా సిటిజన్ సర్వే చేపట్టారని అన్నారు. అక్టోబర్ 10 వ తేదీన ప్రారంభమైన ఈ సర్వేలో ఇప్పటికే ప్రజలు, ప్రవాస భారతీయులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సర్వేలో ప్రతీ ఉద్యోగి పాల్గొని తమ సలహాలు, సూచనలు అందించాల్సిందిగా కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14వ తేదీన సర్క్యులర్ జారీ చేసిందని కలెక్టర్ తెలిపారు. ఈనెల 25 వ తేదీ వరకు కొనసాగే విజన్-2047 సర్వేలో అందరు ఉద్యోగులు పాల్గొనడంతో పాటు ఈ సర్వే లింక్ ను, %ు=% కోడ్ ను తమ తమ కార్యాలయాల్లో ప్రదర్శించాలని, ఈ సర్వే గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ విజన్ - 2047 డాక్యుమెంటరీని రూపొందించడంలో ప్రతి రాష్ట్ర పౌరుడు భాగస్వామ్యమై సిటిజన్ సర్వేలో పాల్గొని తమ ఆలోచనలను పంచుకోవాలని తెలిపారు. ఈ సర్వేలో పాల్గొనేందుకు అనే లింక్ ద్వారా పాల్గొనాలని సూచించారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి: కలెక్టర్



**వలిగొండ అక్టోబర్ 21 అక్షరకలం:**

విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు స్పష్టం చేశారు.మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.వంట సామగ్రిని పరిశీలించి ఆహారం బాగుందా అనిని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు .పాఠశాలలో మొత్తం ఎంత మంది విద్యార్థులు ఉన్నారని,ప్రస్తుతం 10వ తరగతిలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారని, ప్రధానోపాధ్యాయుని అడిగి తెలుసుకున్నారు.10వ తరగతి సోషల్ క్లాస్ ను కలెక్టర్ విద్యార్థులతో కలిసి వినడం జరిగింది.విద్యార్థుల చేత ఇండియా మ్యాప్ వేయించారు.విద్యార్థులు అందరూ ఇప్పటి నుండి వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు.ఈ సంవత్సరం కూడా ఈ స్కూల్ లో 100% ఉత్తీర్ణత సాధించాలని,జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు.ఎక్కువ మార్కులు వచ్చిన వారికి సైకిల్స్ బహుమతిగా అందజేస్తామని,అలాగే మీ తల్లిదండ్రులను కూడా సన్మానించడం జరుగుతుందని సూచించారు.

# క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి.. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.

**అక్షర కలం/నారాయణపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్, 21.**

బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ మరియు రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ హైదరాబాద్ ద్వారా ఈ నెల 24 న కోస్గి సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహణ కు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నారాయణ పేట జిల్లాలోని కోస్గి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళ వారం జిల్లా కలెక్టర్ సందర్శించి ఉచిత క్యాన్సర్ శిబిరం నిర్వహణ పై కడ ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి, వైద్య శాఖ అధికారులతో ఆమె సమీక్షించారు. ఈనెల 24 న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించే క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి నిపుణులైన వైద్యులు వస్తారని, శిబిరంలో క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడానికి ఆరోగ్య విద్య కౌన్సెలింగ్, మహిళలకు పీ ఏ పీ స్మెర్, క్లినికల్ బ్రెస్ట్ ఎగ్జామినేషన్, మామోగ్రఫీ,అల్ట్రాసౌండ్ మెడ,అల్ట్రాసౌండ్ ఉదరం పెల్విస్,సోనో మామోగ్రఫీ, డిజిటల్ ఎక్స్ రే ఛాతీ,నోటి పరీక్షలన్ని నిపుణులైన వైద్యుల క్లినికల్ ప్రిస్క్రిప్షన్ ప్రకారం నిర్వహించబడతాయని కలెక్టర్ తెలిపారు. శిబిరానికి ఇద్దరు మహిళా వైద్యులు ఇద్దరు పురుష వైద్యులు (రేడియాలజిస్ట్‌తో సహా) నర్సులు, టెక్నీషియన్లు మరియు హౌస్ కీపింగ్ సిబ్బందితో సహా 13 మంది సహాయక సిబ్బందితో వస్తారన్నారు. క్యాన్సర్ వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని, క్యాన్సర్ స్క్రీనింగ్ అనేది మన ఆరోగ్యాన్ని కాపాడుకునే ముందస్తు జాగ్రత్త అని ఆమె తెలిపారు. ఎలాంటి లక్షణాలు కనిపించకపోయినా క్యాన్సర్ ను ముందస్తుగా గుర్తించడానికి ఈ స్క్రీనింగ్ దోహదపడుతుందని, ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. రాష్ట్ర హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ తో సమన్వయంతో ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన మోడల్ క్రష్ గదిని కలెక్టర్ పరిశీలించారు. వర్కింగ్ ఉమెన్స్ పిల్లల కోసం మోడల్ క్రష్ గదిని ఎంతో సుందరంగా ముస్తాబు చేశారు. అనంతరం కలెక్టర్ కోస్గి పట్టణంలో నిర్మిస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజి పనులను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డా. మల్లికార్జున్, కోస్గి తహాసిల్దార్ బక్క శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# వార్డెన్ ను వేధింపులు గురిచేసిన అధికారిపై చర్యలు తీసుకోవాలి

**వసతి గృహాల సంక్షేమ అధికారుల సమస్యలు పరిష్కరించాలి**

**టిఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి**

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 21:**

జిల్లాలోని లక్షెట్టిపేట ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్ రాజగోపాల్ ను వేధింపులకు చేసిన అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత కార్యాలయాల భవన సముదాయంలో టీఎన్జీవో ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా వసతి గృహాల సంక్షేమ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుటకు సహకరించాలని కోరుతూ జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ ఉపసంచాలకులు దుర్గాప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ, హాస్టల్ పిల్లల సంక్షేమం కోసం ఖర్చుపెట్టిన బిల్లులు మంజూరు చేయకుండా నిర్లక్ష్యం చేయడమే కాకుండా వ్యక్తిగతంగా అవమానపరుస్తూ, తీవ్రంగా మనోవేదన గురిచేయగా, అధికారుల వేధింపులు తట్టుకోలేక రాజగోపాల్ శనివారం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. దీనిపై వెంటనే విచారణ నిర్వహించి, హాస్టల్ వార్డెన్ రాజగోపాల్ కు న్యాయం చేయాలని, అదేవిధంగా బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సానుకూలంగా స్పందిస్తూ, పూర్తి విచారణ నిర్వహించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవోస్ యూనియన్ జిల్లా కోశాధికారి ఏ సతీష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు రామ్ కుమార్, తిరుపతి, జాయింట్ కార్యదర్శి సురేందర్, పబ్లిక్ కార్యదర్శి యూసుఫ్, రాజేందర్, మంచిర్యాల యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు గోపాల్, అజయ్ ప్రశాంత్, విజయ, బెల్లంపల్లి యూనిట్ అధ్యక్షుడు వెంకటేష్, సభ్యులు గంగారం, సుజిత్ రావు, జిల్లా వసతి గృహాల సంక్షేమ అధికారుల సంఘం అధ్యక్షుడు మోహ్సిన్, కార్యవర్గ సభ్యులు ధర్మానంద్ గౌడ్, కుమార్, సునీత, కిషోర్, సుభద్ర, సుధాలక్ష్మి, జయశంకర్, శ్రీనివాస్ లు పాల్గొన్నారు.




# ఈ నెలాఖరు నాటికి జిల్లాలోని అన్ని మున్సిపల్ ప్రాంతాలలో తాత్కాలిక పనులు చేసుకునే వారందరితో భీమా చేయించాలి .

**కనీసం 4 వేల మంది తాత్కాలిక పనులు చేసుకునే వారితో భీమా చేయించాలి-జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి.**

**అక్షర కలం/ నల్లగొండ**

జిల్లాలోని అన్ని మున్సిపల్ ప్రాంతాలలో తాత్కాలిక పనులు చేసుకుని జీవించే వారితో ముఖ్యంగా వాహనాల ద్వారా స్వల్పకాలిక పనులు చేసుకునే వారందరితో జీవిత బీమా చేయించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ అన్నారు. మంగళ వారం ఆమె తన ఛాంబర్ లో మున్సిపల్ కమిషనర్లతో తాత్కాలిక పనులు చేసుకునే వారికి జీవిత భీమా సౌకర్యం కల్పించే విషయమై సమీక్షించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తాత్కాలికంగా పనులు చేసుకుని జీవించే వారికి బ్యాంకుల ద్వారా 2 లక్షల రూపాయల వరకు వివిధ రకాల బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నాయని తెలిపారు. రోజు రోజుకు స్వల్పకాలిక కార్మికుల సంఖ్య పెరిగిపోతుండడం, ప్రత్యేకించి అమెజాన్, జొమాటో, ఫ్లిప్ కార్ట్ ,తదితర సంస్థలలో వాహనాల పై పనిచేసేవారు, డెలివరీ చేసేవారు అలాగే డ్రైవర్లు, కార్మికులు వీరందరూ ప్రమాదవశాత్తు మరణించినా లేదా



అంగవైకల్యం పొందినా బీమా సౌకర్యాన్ని పొందేందుకు ఆస్కారం ఉందన్నారు. ఇందుకుగాను సంవత్సరానికి కేవలం 20 /- రూపాయల ప్రీమియం చెల్లిస్తే సరిపోతుందని, దురదృష్టవశాత్తు అలాంటి కార్మికులు మరణిస్తే 2 లక్షల రూపాయలు, అంగవైకల్యం కలిగితే లక్ష రూపాయల జీవిత బీమా అందుతుందన్నారు . ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్లు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని ఆదేశించారు . ఈ నెలాఖరు లోగా జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో కనీసం 4 వేల మంది తాత్కాలిక పనులు చేసుకునే వారితో భీమా చేయించాలన్నారు .ఆయా మున్సిపాలిటీ పరిధిలో పనిచేసే స్వల్పకాలిక కార్మికులందరికీ ప్రమాద భీమా వర్తింపజేసేందుకు శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. 20/- రూపాయల ప్రీమియం తో పాటు, ఆధార్ , బ్యాంక్ పాస్ బుక్,మొబైల్ నెంబర్ ఇవ్వాలని, 18 నుండి 70 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారందరు బీమా చేసుకోవచ్చని ఆమె తెలిపారు.స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్,, మున్సిపల్ కమిషనర్లు తదితరులు హాజరయ్యారు.

# అక్టోబర్ 25 లోగా సిటిజన్ సర్వేలో పాల్గొనాలి..జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 21:**



తెలంగాణ రైసింగ్ విజన్ 2047లో భాగంగా మీ స్వరం – మీ దార్శనికత – మా భవిష్యత్తు నినాదంతో రాష్ట్ర పౌరులు రాష్ట్ర పురోగతిని ఊహించుకునే అంశాన్ని ప్రభుత్వంతో పంచుకోవాలనే ఉద్దేశంతో చేపట్టిన సిటిజన్ సర్వే కార్యక్రమంలో అక్టోబర్ 25వ తేదీలోగా పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రకటనలో తెలిపారు. 2047 నాటికి భారతదేశం 100 సంవత్సరాల స్వాతంత్రం జరుపుకునే నాటికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధి, రూపొందించే దీర్ఘకాలిక రోడ్డు మ్యాప్ – తెలంగాణ రైసింగ్ విజన్ – 2047 అంశాలతో డాక్యుమెంటరీ తయారీలో భాగస్వామ్యం పొందేలా సిటిజన్ సర్వే చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ సర్వేలో రాష్ట్ర ప్రజలు, ఎన్ఆర్ఐ లు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని, రాష్ట్రంలోని ప్రతి ఉద్యోగి ఈ సర్వేలో పాల్గొని తమ విలువైన సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. అక్టోబర్ 25వ తేదీ లోగా విజన్ 2047 సర్వేలో ఉద్యోగులందరూ పాల్గొనడంతో పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. రానున్న రోజులలో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాలలో అగ్రగామికంగా నిలబెట్టేందుకు ప్రభుత్వం రూపొందిస్తున్న తెలంగాణ రైసింగ్ విజన్ – 2047 డాక్యుమెంటరీని రూపొందించడంలో ప్రతి రాష్ట్ర పౌరుడు భాగస్వామ్యమై సిటిజన్ సర్వేలో పాల్గొని తమ ఆలోచనలను పంచుకోవాలని, ఇందు కొరకు వెబ్ సైట్ లో సందర్శించాలని తెలిపారు.

# పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి



## జిల్లా కలెక్టర్



## కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 21:**

విధి నిర్వహణలో పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డిసిపి కరుణాకర్, ఇతర పోలీసు ఉన్నతాధికారులతో కలిసి హాజరై, అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించి 2 నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణత్యాగాలకు వెనుకాడకుండా సేవలు అందించే పోలీసులు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ప్రజల రక్షణలో తమ ప్రాణాలను అర్పించిన పోలీసులు ఆచరించిన మార్గం స్ఫూర్తితో ప్రజల శ్రేయస్సుకు కృషి చేయాలని, చిత్తశుద్ధి, నీతి, నిజాయితీతో పని చేయాలని, పోలీసు అమరుల త్యాగాలు మరువలేమని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. పోలీసు అమరుల కుటుంబాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, వారికి ఎలాంటి సమస్య రాకుండా అండగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి (అడ్మిన్) శ్రీనివాస్, మంచిర్యాల ఎసిపి ప్రకాష్, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐ లు, సిపిఓ, స్పెషల్ పార్టీ, ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్






**వలిగొండ అక్టోబర్ 21 అక్షరకలం:**

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా కొనుగోలు చేయాలని,యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు.మంగళవారం ఆయన వలిగొండ మండల పరిధిలోని ఎదుల్లగూడెం, మందాపురం, నాతల్లగూడెం, రెడ్లరేపాక,గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొలుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు ఇప్పటి వరకు ఎంత ధాన్యం వచ్చిందని,ఎంత మేరకు కొనుగోలు చేయడం జరిగిందని అడిగి తెలుసుకున్నారు.రైతులు ఎవరు కూడా దళారులను నమ్మి కష్టపడి పండించిన పంటని తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోకూడదన్నారు.ప్రభుత్వం రైతులకు అన్ని సౌకర్యాలు కలిపించిందని,ధాన్యంకి మద్దతు ధర కూడా కల్పించిందని,ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలలో మాత్రమే ధాన్యం అమ్ముకోవాలని అన్నారు.కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు.ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి అని తెలిపారు.కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న రైతులను ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలన్నారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని అన్నారు. రైతులు తెచ్చిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఆయన వెంట తహశీల్దార్ దశరథ,వ్యవసాయ అధికారి అంజనీ దేవి,ఏపిఏం అంజయ్య,ఆర్ఐ కరుణాకర్ రెడ్డి,హౌసింగ్ ఏఈ కిరణ్, ఏఈఓ కళ్యాణి,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**వలిగొండ అక్టోబర్ 21 అక్షరకలం:**

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి భూ భారతి,రెవెన్యూ సదస్సులో, వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు.భూ సమస్యల పై సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించాలన్నారు.కుల ఆదాయ,జనన,మరణ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను,పెండింగ్ లో లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. అనంతరం జిపిఓలకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దశరథ,ఎంపీడీవో జలంధర్ రెడ్డి,డిప్యూటీ తహశీల్దార్ పల్లవి,సీనియర్ అసిస్టెంట్ మనోహర్,ఆర్ఐ కరుణాకర్ రెడ్డి,హౌసింగ్ ఏఈ కిరణ్,రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**వలిగొండ అక్టోబర్ 21 అక్షరకలం:**

మండల పరిధిలోని రెడ్లరేపాక ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు.అనంతరం రికార్డులను పరిశీలించి,ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అయిన బాలింత కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సేవలు,మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత,సిబ్బంది హాజరు, రోగుల రిజిస్టర్లు,డాక్టర్ల హాజరు





పత్రాలు,రికార్డులను పరిశీలించారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని,ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాల్సిన అవసరం ఉందని,ప్రభుత్వ వైద్య కేంద్రాలపై ప్రజల్లో నమ్మకం పెరగాలంటే సేవల నాణ్యతతో పాటు,సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించడం ఎంతో అవసరమని కలెక్టర్ అన్నారు. దీంతో మౌలిక సదుపాయాల పై డాక్టర్ తేజస్విని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా,ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కావలసిన పరికరాలు,చేపట్టవలసిన అభివృద్ధి పనులపై నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ తేజస్వినిని,జిల్లా కలెక్టర్ హనుమంతరావు శాలువాతో సన్మానించారు.ఆయన వెంట తహశీల్దార్ దశరథ,ఆర్ఐ కరుణాకర్ రెడ్డి,ఏపీఏం అంజయ్య,ఏఎన్ఏం లక్ష్మీ,ఆశ వర్కర్ పాల్గొన్నారు.

# హుస్నాబాద్ ఆసుపత్రిని రాష్ట్రంలో నెంబర్ వన్ ఆస్పత్రిగా తీర్చిదిద్దేందుకు కృషి: మంత్రి పొన్నం ప్రభాకర్:

**హైదరాబాద్: అక్టోబర్ 21, ( అక్షర కలం):**

హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించారు. నూతనంగా నిర్మిస్తున్న 250 పడకల ఆసుపత్రి భవన నిర్మాణాన్ని పరిశీలించారు. 82 కోట్ల రూపాయలతోఅధునాత హంగులతో 250 పడకల ఆసుపత్రి భవన నిర్మాణం జరుగుతోంది.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోనే నెంబర్ వన్ ఆసుపత్రి గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. హుస్నాబాద్ కు త్వరలో నర్సింగ్ కళాశాలను తీసుకురావడానికి



చర్యలు తీసుకూంటానన్నారు.టూరిజం కోసం మహాసముద్రం గండి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. గౌరవెల్లి కాలువల పనులకు భూసేకరణ జరుగుతోందని, రైతులందరూ సహకరించాలని కోరారు. హుస్నాబాద్ ఆస్పత్రిలో ప్రస్తుతం 8 మంది డాక్టర్లు ఉన్నారని, జిల్లా కేంద్రం లాగా 250 పడకల హాస్పటల్, 38 మంది డాక్టర్లు ఉంటారన్నారు. క్యాన్సర్ పారదొలడానికి పొన్నం సత్తయ్య ట్రస్టు ద్వారా మహిళా సంఘాలకు 13 రకాలు వస్తువులతో స్టీల్ పాత్రలను పంపిణీ చెయ్యడం జరిగిందన్నారు. ఆరోగ్యం, వైద్యం, వ్యవసాయం, ప్రాజెక్టులు, ఇన్ఫ్రాస్ట్ స్ట్రక్చర్ అన్ని రంగాలలో హుస్నాబాద్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# పట్టణ పరిశుభ్రతలో మున్సిపల్ కార్మికులదే కీలక పాత్ర

### మున్సిపల్ కార్మికులతో కలిసి అలాయ్ బలై కార్యక్రమం నిర్వహించిన మలిదశ ఉద్యమకారుడు సంజయ్ దాస్ గౌడ్



**చిట్యాల : ( అక్టోబర్ 21) అక్షర తలం , ప్రతినిధి**

నల్గొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ లో పారిశుద్ధ్య కార్మికులతో దీపావళి పండగను పురస్కరించుకొని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కూనూరు సంజయ్ దాస్ గౌడ్ అలాయి బలాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ కార్మికులను గౌరవపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అలాగే కార్మికులకు నూతన దుస్తుల కొనుగోలు కోసం 25 వేల రూపాయలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పట్టణ పరిశుభ్రత కోసం కష్టపడే కార్మికుల సేవను గుర్తిస్తూ వారికి కృతజ్ఞత తెలపడం కోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణ పరిశుభ్రంగా ఉంచి ప్రజలకు అనారోగ్యం పాలు కాకుండా చేస్తున్న ఘనత మున్సిపల్ కార్మికులకే దక్కుతుందని , పట్టణ సౌందర్యానికి శిల్పులు మున్సిపల్ కార్మికులు అని వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు తమ సేవలను ఇప్పటివరకు ఎవరు కూడా పట్టించుకోలేదని తమకు ఇచ్చిన ఈ గౌరవానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల లక్ష్మయ్య, జడల నరసింహ, మేడి యాదయ్య, బొడ్డు యాదయ్య, పోలే సైదులు, రుద్రవరం మల్లేష్, చిత్రగంటి ప్రణీత్, పోకల ముత్తయ్య, మేడి శేఖర్, రుద్రవరం నరసింహ, మీసాల కిషన్, మేడి సైదులు, జిట్ట నరేష్, జిట్ట వెంకన్న, పన్నాల నాగిరెడ్డి, పాల శంకర్, పాలస్వామి, మీసాల శ్రీకాంత్, జిట్ట దుర్గేష్, మహిళా కార్మికులు బాకీ అందాలు, గోలి ధనలక్ష్మి, రుద్రవరం అండాలు, కుక్కల కలమ్మ, బోడ అలివేలు, పాల రమణ, మేడి శోభ, జనపాల జ్యోతి, పిల్లి కవిత తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సమృద్ధిగా ఇసుక...

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**చింతకాని, బోనకల్ మండలాల్లో ఇసుక డంప్ ఏర్పాటు**

**లబ్ధిదారులకు సకాలంలో ఇండ్ల బిల్లులు అందించేలా చర్యలు**

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక లభ్యతపై సమీక్షించిన జిల్లా కలెక్టర్**

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా సమృద్ధిగా అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.జిల్లా కలెక్టర్, కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక లభ్యతపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ప్రతి సోమవారం లబ్ధిదారులకు నిర్మాణ పురోగతి ఆధారంగా బిల్లులు చెల్లించడం జరుగుతుందని అన్నారు. చింతకాని, బోనకల్ మండలాల్లో ఇసుక సమస్య కారణంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఆలస్యం అవుతుందని, ఈ సమస్య పరిష్కారం కోసం ముదిగొండ మండలం నుంచి ఇసుక స్టాక్ తెప్పించి చింతకాని, బోనకల్ మండలాల్లో ఇసుక డంప్ ఏర్పాటు చేసి ఇంటి నిర్మాణానికి ఎక్కడ ఎటువంటి సమస్య రాకుండా చూడాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట ఇసుక దోపిడీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇసుక సరఫరాలో మండల స్థాయిలో ఉన్న సమస్యలను తహసిల్దార్లు ప్రత్యేకంగా పర్యవేక్షించి పరిష్కరించాలని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో పడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇంటి నిర్మాణ పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో తహసిల్దార్ లు, హౌసింగ్ ఏఈ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# వెలకం సంతోష్ కి ఆర్థిక సహాయం..ఐటిడిఎ, పి ఓ, బి.రాహుల్



అక్షరకలం/ భద్రాచలం

కళాశాలలో చదువుతోపాటు ప్రతిరోజు క్రీడలలో సాధన చేసే సమయంలో లాంగ్ జంప్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు విరిగిపోయిన వెలకం సంతోష్ కు వైద్యం చేయించుకోవడానికి ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సహాయం అందించడం జరిగిందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. మంగళవారం నాడు తన ఛాంబర్ లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలం, ఆర్లపెంట గ్రామంకు చెందిన వెలకం సంతోష్ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల గుండాలలో సీఈసీ రెండవ సంవత్సరం చదువుతున్నాడని, ప్రతిరోజు క్రీడల పీరియడ్లో లాంగ్ జంపింగ్ సాధన చేయుచుండగా అనుకోకుండా ప్రమాదవశత్తు కాలు విరిగిపోవడం జరిగిందని ఆయన అన్నారు.ఆ బాలుడి తల్లిదండ్రులు నాగరాజు, కుమారి కూలి పనులు చేసుకుంటూ కుమారుడిని గురుకులంలో చదివిస్తున్నామని తమవద్ద ఆర్థిక స్తోమత లేదని వైద్య ఖర్చుల కొరకు సహాయం అందించాలని అర్జీ పెట్టుకోగా, ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుంచి ఇరవై ఐదు వేల రూపాయల చెక్కును ఆ బాలుడి తల్లిదండ్రులకు అందించి సరియైన వైద్యం చేయించాలని తెలుపుతూ, సీఈసీ గ్రూప్ చదివిన విద్యార్థులు బాగా చదివి గ్రూప్ వన్, గ్రూప్ టూ, గ్రూప్ త్రీ కోచింగ్ తీసుకొని పరీక్షలు బాగా రాసి మంచి ర్యాంకు సాధించి ఉద్యోగాలు సంపాదించుకోని జీవనోపాధి పెంపొందించుకొని, జీవితంలో స్థిరపడాలని విద్యార్థికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో సున్నం రాంబాబు, ఆర్ సి ఓ గురుకులం అరుణకుమారి, విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# స్పందించిన మరికల్ పోలీస్ సిబ్బంది.



అక్షర కలం/నారాయణపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్:21.

నారాయణపేట జిల్లా మరికల్ ప్రధాన రహదారిపై ఈదురు గాలిలతో కూడిన భారీ వర్షానికి పెద్ద చింతకుంట స్టేజి వద్ద రోడ్డుపై పెద్ద చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడినందున సమాచారం తెలుసుకున్న మరికల్ పోలీసులు ఎస్ఐ 2 మహేశ్వరి ఆధ్వర్యంలో తక్షణమే అక్కడకి చేరుకొని రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టుని తొలగించి రహదారిని క్లియర్ చేశారు. వాహనదారులు ప్రయాణికులు ఆ సమయంలో లేనందున ఎలాంటి ప్రమాదం జరగలేదు ప్రజలు వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించి ప్రయాణించాలని మరికల్ ఎస్సై 2 మహేశ్వరి తెలిపారు. ఏ ఎస్సై మసూద్, పిసి లు రజిత, శివ పాల్గొన్నారు.

# నారాయణపేట ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు.

**- పేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్యం పర్ణిక రెడ్డి.**

అక్షర కలం / నారాయణపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ : 21.



నారాయణ పేట్ నియోజకవర్గ ప్రజలందరికీ శాసన సభ్యురాలు చిట్టెం పర్ణిక రెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి ప్రజల జీవితాల్లో కోటి కాంతులు నింపాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా.. చీకటిని పారద్రోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా, దుష్ట శక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి ప్రతి ఇంటా ఆనందాలను, సిరులను కురిపించాలని ఎంపీ ఆకాంక్షించారు. ఆనందాన్ని, ఐశ్వర్యాన్ని, ఆరోగ్యాన్ని ఆహ్వానించే దీపావళి పండుగ నాడు లక్ష్మీదేవి మీ ఇంటిల్లిపాదినీ సకల శుభాలతో అనుగ్రహించాలని కోరుకుంటున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బాణా సంచా కాల్చే సమయంలో ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, భక్తి శ్రద్ధలతో పండుగ జరుపుకోవాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి ఆకాంక్షించారు..

# పోలీసు అమరవీరుల త్యాగం మరువలేనిది

అక్షర కలం, ఆమనగల్లు :

పోలీసు అమరవీరుల త్యాగం మరువలేదని ఆమనగల్లు మాజీ జెడ్పిటిసి పత్యానాయక్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమం బుధవారం ఆమనగల్లు పోలీస్ స్టేషన్ ఆవరణలో టిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. విధి నిర్వహణలో పోరాడి మరణించిన కాంస్య హనుమంత్ రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణ త్యాగం చేసిన పోలీసుల సేవలను ఎప్పటికీ మర్చిపోలేరని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పట్టణ అధ్యక్షుడు పత్య నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్ గౌడ్, సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్, సాయిలు, మహేష్ వరికుప్పల గణేష్, వడ్డేమోని శివకుమార్, దేరంగుల వెంకటేష్,లండం చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.




# శాంతి భద్రతల సంరక్షణలో పోలీసుల పాత్ర కీలకం...

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

### విపత్కర సమయాల్లో మొదటగా స్పందించేది పోలీసులు మాత్రమే

### పండుగలు ప్రశాంతంగా జరుపుకోవడంలో పోలీసుల సహకారం మరువలేనిది

### ప్రతి పౌరులు పోలీసుల గొప్పతనం తెలుసుకోవాలి

### పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:





శాంతి భద్రతల సంరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.పోలీసు అమరవీరుల సంస్మరణ దినం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా మంగళవారం పోలీసు పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, డిఎఫ్ఓ సిద్దార్థ విక్రమ్ సింగ్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించిన పోలీసు అమరవీరులకు ప్రతి ఒక్కరూ నివాళులు అర్పించాలని అన్నారు. ప్రభుత్వంలో ప్రతి శాఖ పని తీరులో పోలీస్ సహకారం సంపూర్ణంగా ఉంటుందని అన్నారు. భూ సేకరణ, ధాన్యం కొనుగోలు, ఎన్నికల నిర్వహణ, శాంతియుతంగా వేడుకలు జరగాలన్నా కూడా ప్రతి ఒక్క అంశంలో పోలీస్ సహకారం అవసరమని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఖమ్మం జిల్లా యంత్రాంగానికి పోలీసులు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని అన్నారు. దీపావళి, హెూళి, వినాయక నిమజ్జనం వంటి అనేక పండుగలు ప్రశాంతంగా జరుపుకోవడంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రతి పౌరులు పోలీసుల గొప్పతనం తెలుసుకోవాలని, కృతజ్ఞతగా ఉండాలని, కానిస్టేబుల్ నుంచి డీజీపి వరకు నేర నియంత్రణ కోసం పాటు పడుతారని అన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చిన వెంటనే 100 కు ఫోన్ చేస్తారని, అన్ని విపత్కర సమయాలలో మొదటగా స్పందించేది పోలీసులు మాత్రమే నని, 24 గంటల పాటు డ్యూటీలో ఉంటారని అన్నారు. పోలీసులు ప్రతిరోజు కుటుంబ సమయాన్ని త్యాగం చేస్తూ మన కోసం విధులు నిర్వహిస్తున్నారని, అటువంటి వారిపట్ల మనం నిరంతరం గౌరవ భావంతో ఉండాలని అన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు శాంతి చేకూరాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీసు కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ 21 అక్టోబర్ 1959 లద్దాక్ ప్రాంతంలో దేశ సరిహద్దు కాపాడటంలో 10 మంది సిఆర్పిఎఫ్ సిబ్బంది చైనా సైనికులతో వీరోచితంగా పోరాడి మరణించారని, విధులలో ఉండి మరణించిన పోలీసుల త్యాగాలకు చిహ్నంగా మనం నేడు పోలీసు అమరవీరుల సంస్కరణ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. గత సంవత్సర కాలంగా భారత దేశ వ్యాప్తంగా శాంతిభద్రతలు కాపాడేందుకు 191 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రతి పోలీసు వ్యక్తికి దేశం మొదటి ప్రాధాన్యతగా ఉండాలని అన్నారు. డిఎఫ్ఓ సిద్దార్థ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ పోలీస్ యూనిఫామ్ చాలా పెద్ద బాధ్యత అని, ప్రతి రోజు క్రిమినల్స్ తో పోరాటం, చాలా కష్టాలతో విధులు నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. సమాజంలో శాంతి భద్రతలు పకడ్బందీగా ఉండాలంటే పోలీసులు సరిగ్గా పని చేయాలని అన్నారు. పోలీసులు సరిగ్గా పనిచేస్తున్నారు అంటే దానికి వారి కుటుంబాలు కూడా చాలా సహకరిస్తున్నాయని తెలిపారు.అనంతరం విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు స్మారక స్థూపం వద్ద జిల్లా కలెక్టర్, పోలీసు కమీషనర్, అటవీశాఖ అధికారి పుష్పగుచ్చాలు ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ పేరడ్ మైదానంలోని అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించగా, పోలీస్ అమర వీరుల స్థూపం వద్ద జిల్లా అధికార యంత్రాంగం, పోలీస్ అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబీకులు పూలమాలలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. తొలుత, అమర వీరుల స్మృత్యర్థం సాయుధ బలగాలు పెరేడ్, గార్డ్ ఆఫ్ హానర్ నిర్వహించారు. అనంతరం పోలీసు ఆయుధాలు కిందకు దింపి వందనం చేసి రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి లు ప్రసాద రావు, రామానుజం, పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.
.

# జాబ్ మేళాకు అభ్యర్థులు హాజరయ్యే విధంగా చూడండి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి టెలి కాన్ఫరెన్స్ లో అధికారులను ఆదేశించిన కలెక్టర్

అక్షరకలం నల్గొండ



ఈనెల 25న సూర్యాపేట జిల్లా, హుజూర్నగర్ లో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాకు నల్గొండ జిల్లా నుండి నిర్దేశిత సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు.జాబ్ మేళా పై మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం,ఎన్ జి కళాశాల, లో విద్యార్థులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. మంగళవారం ఆమె ఈ నెల 25 న హుజూర్నగర్ లో నిర్వహిం చనున్న మెగా జాబ్ మేళా పై సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. హుజూర్నగర్ లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెనక వైపున ఉన్న పెర్ల్ ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ స్కూల్ లో ఈ నెల 25 న ఉదయం 8 గంటలనుం డి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే మెగా జాబ్ మేళాకు సుమారు 150 కంపెనీలు 3000 నుండి 5000 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రానున్నాయని తెలిపారు. ఎస్ఎస్ సి, ఇంటర్, ఐటిఐ, డిప్లమా, డిగ్రీ, ఎంబీఏ, బిటెక్, పీజీ, ఫార్మసీ ఉత్తీర్ణులైన 18 నుండి 40 సంవత్సరాల మధ్య వయసు ఉన్న నిరుద్యోగ యువత 5 రేజ్యూమ్ కాపీలు, 2 కలర్ పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, ధ్రువ పత్రాలతో ఈ జాబ్ మేళాకు హాజరు కావచ్చని ఆమె వెల్లడించారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా జాబ్ మేళా కు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చున్నారు.జాబ్ మేళాకు వచ్చే వారికి పెర్ల్ ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ స్కూల్ పక్కన ఉన్న స్వర్ణ వేదిక ఫంక్షన్ హాలులో టిఫిన్, భోజన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాకు జిల్లా తరఫున నిర్దేశించిన సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యేలా చూడాలని అన్నారు. జాబ్ మేళాకు సంబంధించి న పబ్లిసిటీ మెటీరియల్ జిల్లాలోని అన్ని ప్రాంతాలలో, ముఖ్యమైన ప్రదేశాలలో అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలని చెప్పారు. రెవెన్యూ అదనపు కలెక్టర్. జె. శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ సతీష్, ఎన్జి కళాశాల ప్రిన్సిపల్, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, డీఈవో మాట్లాడారు.

# ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై మన్యం.

**- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు .**

**... సైబర్ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలి.**

అక్షర కలం/నారాయణపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్:21.



నర్వ మండల కేంద్రంలో మన్యం ఆధ్వర్యంలో ప్రజలకు, ప్రయాణికులకు, యువతకు సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, రోడ్డు భద్రత నియమాలు, నూతన పోలీస్ చట్టాలు, బాల్యవివాహాలు, దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇలా పలు సామాజిక అంశాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రస్తుతం సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటర్నెట్, మొబైల్ యాప్‌లు, సోషల్ మీడియా వేదికగా మోసాలు జరిగే ప్రమాదం అధికంగా ఉంది.

సాధారణంగా జరిగే సైబర్ నేరాలు.

...ఫోన్ కాల్స్ ద్వారా బ్యాంక్‌పాస్వర్డ్ అడిగి డబ్బు మోసాలు.

...ఫేక్ లింక్స్ క్లిక్ చేయించి పర్సనల్ డేటా దొంగతనం

...సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్లు ద్వారా మోసం

...లావాదేవీలకు సంబంధించి ఫిషింగ్, స్మిషింగ్, విషింగ్ మోసాలు

అపరిచిత యాప్‌లు ద్వారా మొబైల్ హ్యాకింగ్ అవుతున్నాయని అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఒకవేళ సైబర్ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

సైబర్ నేరాలపై నర్వ పోలీసుల సూచనలు:

... బ్యాంక్ డిటైల్స్, ఎవరితోనూ పంచుకోకండి.అనుమానాస్పద లింకులు క్లిక్ చేయవద్దు. ఫోన్‌కు వచ్చిన అపరిచిత లింకులు, మెసేజ్‌లను వెంటనే డిలీట్ చేయండి. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం పంచుకోకండి. ఫేక్ కాల్స్, మోసపూరిత లింకులపై తక్షణమే 1930 లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయండి. డౌన్‌లోడ్ చేసే యాప్‌లు ప్లే స్టోర్ లేదా అపిల్ స్టోర్ నుంచే డౌన్‌లోడ్ చేయండి. పబ్లిక్ %ఔఱ-ఖీఱ% నెట్‌వర్క్‌లలో లావాదేవీలు చేయకండి.

ప్రజలందరూ పై సూచనలు పాటించి సైబర్ మోసాల నుంచి తమను తాము రక్షించుకోవాలి. ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించిన వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఈ కార్యక్రమంలో నర్వ పోలీసులు నరసింహులు, నాగభూషణం, సురేష్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా మారిన కల్వర్టు గుంతలు....

- సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించాలి.
- మాజీ సర్పంచ్ కావలి భారతి సచిన్..

అక్షర కలం /నారాయణపేట జిల్లా ప్రతినిధి :అక్టోబర్ :21.





నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల పరిధిలోని ఎంనోని పల్లి నుండి ధన్వాడ మండల కేంద్రానికి వెళ్లే రహదారి లో ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా పెద్ద గుంతలుగా మారిన అధికారులు పట్టించుకోవడంలేదని యమ్నోన్ పల్లి గ్రామ మాజీ సర్పంచ్ కావలి భారతి సచిన్ ఆరోపించారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ పలుసార్లు ఇట్టి రోడ్డు విషయంపై పంచాయతీరాజ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడం లేదన్నారు. అదేవిధంగా ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడం లేదన్నారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఆ రోడ్డు గుంతలు కల్వర్టు దగ్గర ఉన్న మీ కాబట్టి మా పరిధికి రావని వారంటున్నారు. ఇరిగేషన్ అధికారులు పంచాయతీరాజ్ శాఖ వారి పరిధికి వస్తుందని వారంటున్నారు. రెండు శాఖల మధ్య రోడ్డు పెద్ద గుంత ఏర్పడడం వల్ల వారానికో ప్రమాదం జరుగుతూ ఉండడం చాలా బాధాకరమని వారన్నారు. ఎన్ని మార్లు అధికారులకు విన్నవించుకున్న అధికారులు నిద్ర మబ్బుల్లో ఉన్నారని ఆయన ఆరోపించారు. యమ్నోన్ పల్లి నుండి ధన్వాడ కెళ్ళే రహదారి ఆదమరిస్తే వాహనదారులకు తీవ్ర గాయాలు, లేదా ప్రాణాల పైకి వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు. గతంలో ఎంతోమందికి గాయాలని ఆయన గుర్తు చేశారు. ఇట్టి విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించకపోతే గ్రామస్తుల ఆధ్వర్యంలో ధన్వాడ మండల కేంద్రంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని మాజీ సర్పంచ్ కావాలి సచిన్ డిమాండ్ చేశారు.

# పల్లె గడ్డ గ్రామ కళాకారుడికి ఘన సన్మానం.



అక్షర కలం/నారాయణపేట జిల్లా ప్రతినిధి: అక్టోబర్ :21.

పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా కేసరి కళావేదిక నాగర్ కర్నూల్ వారు నిర్వహించిన ఉమ్మడి పాలమూరు జిల్లా పద్య పఠన పోటీలలలో భాగంగా నారాయణపేట జిల్లా మరికల్ మండలం పల్లెగడ్డ శ్రీ శివపార్వతి కళానాట్యమండలి సభ్యుడు ప్రథమ బహుమతి పొందిన కుంటకొమ్ము మురళి కి జిల్లా రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ చక్రధర్ మరియు యస్. తిరుపతయ్య హార్మోనిస్టు మరియు జిల్లా రంగస్థల కళాకారులు శాలువాతొ సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ముగిసిన సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్

## డీకేపిఎస్ డ్యాన్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో నిర్వహణ

అక్షర కలం, ఆమనగల్లు :

గ్రామీణా ప్రాంతంలోని క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయాలనే ఉద్దేశ్యంతోనే క్రికెట్ టోర్నమెంట్ ని ర్వహించానని డీకేపిఎస్ డాన్స్ అకాడమీ ఫౌండర్ ప్రభుశంకర్ అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీలో రెండు రోజులపాటు నిర్వహించిన సర్కిల్ టోర్నమెంట్



విజయవంతంగా ముగిసింది. ఈ టోర్నమెంట్లో మొత్తం పది జట్లు పాల్గొనగా చివరిగా ఉత్కంఠ పోరులో సర్కిల్ హిట్టర్స్ టీమ్ విన్నర్స్ గా గెలిచారు.జి జి గ్లాడియేటర్స్ టీమ్ రన్నర్స్ గా నిలిచారు. ఈ టోర్నమెంట్ లో గెలుపొందిన వారికి మీసాల గోపి నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో ఆటగాళ్లు గోరటి దేవేందర్, నీరటి (కొత్ర) రాజు, వరికుప్పల రాజు, కోరే మహేందర్, ఎనుమల్ల రమేష్, వస్పుల రంజిత్, కొమ్ము ప్రసాద్, తల్లోజు నరసింహ, రామకృష్ణ, వస్పుల సురేష్, డ్యాన్స్ మాస్టర్ ప్రభు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షపాతిగా ప్రజా ప్రభుత్వం పాలన

## - కూసుమంచి మండల పర్యటనలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

అక్షర కలం: ఖమ్మం ప్రతినిధి:






కూసుమంచి : పేదల పక్షపాతిగా ప్రజా ప్రభుత్వం పాలన చేస్తున్నదని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి కూసుమంచి మండలంలోమంగళవారం పర్యటించి పలు రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.... నేలపట్ల గ్రామంలో ముదిగొండ రోడ్డు నుంచి కొత్త చెరువు వరకు రూ. 2 కోట్ల 75 లక్షలతో బీటి రోడ్డు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. మునిగేపల్లి నుంచి వీరేంద్ర స్వామి దేవస్థానం వయా వెంకటాపురం మీదుగా 8 కిలోమీటర్ల మట్టి రోడ్డు రూ. 3 కోట్లతో మంజూరు చేశామని, త్వరలోనే ఆ పనులకు శంకుస్థాపన చేస్తామని అన్నారు.నేలపట్ల గ్రామంలో 34 లక్షలతో అంతర్గత సిసి రోడ్లు నిర్మించామని, మరో 15 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. అంగన్వాడి భవనానికి రూ. 5 లక్షలు, త్రాగునీటి మరమ్మతు పనులకు రెండు లక్షల రూపాయలు, ప్రజా ప్రభుత్వంలో గడిచిన 22 నెలల కాలంలో మొత్తంగా రూ. 6 కోట్ల 31 లక్షల రూపాయలు నేలపట్ల గ్రామ అభివృద్ధికి మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ధర్మతండ గ్రామంలో రూ. 3 కోట్ల 75 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. లోక్య తండా నుంచి ధర్మ తండా వరకు కోటి 26 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన రోడ్డు ప్రస్తుతం టెండర్ దశలో ఉందని, వర్షాకాలం లోపు ఆ రోడ్డు శంకుస్థాపన చేస్తామని, రాబోయే వర్షాకాలంలోపు ఈ రోడ్లు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని అన్నారు. గత 22 నెలల కాలంలో ప్రజల ఆశీర్వాదంతో ధర్మతండా గ్రామానికి రూ. 46 లక్షలతో అంతర్గత సిసి రోడ్లు నిర్మించుకున్నామని అన్నారు. రూ. 20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం నిర్మించామని, మొత్తం ధర్మతండా గ్రామానికి రూ. 5 కోట్ల 95 లక్షల నిధులు అభివృద్ధి కోసం మంజూరు చేయడం జరిగిందని అన్నారు. పేదల ఆశీర్వాదంతో వచ్చిన ప్రజా ప్రభుత్వం పేద కుటుంబాలకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్తు, ఉగాది నుంచి రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం, నూతనంగా పేద కుటుంబాలకు రేషన్ కార్డుల జారి, పాత రేషన్ కార్డులలో నూతన సభ్యుల పేర్ల నమోదు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. రైతును రాజు చేయడంలో భాగంగా మొదటి ఏడాదిలో 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రూపాయల 2 లక్షల రుణమాఫీ, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాకు 500 రూపాయల బోనస్ అందించామని, ప్రస్తుత సీజన్లో కూడా బోనస్ ఇవ్వడానికి క్యాబినెట్ నిర్ణయించిందని, రాబోయే వారం నుంచి పది రోజులలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు.పేద ప్రజలకు భరోసా, ధైర్యం అందించేలా ఇందిరమ్మ ఇండ్లను ప్రజా ప్రభుత్వం నిర్మిస్తుందని, పేద ప్రజలకు ఇచ్చిన మాట మేరకు మొదటి దఫాలోనే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 3500 చొప్పున రాష్ట్రంలో మొత్తం 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, మన నేలపట్ల గ్రామంలో మొదటి విడత క్రింద 18 ఇండ్లు మంజూరు చేశామని, పేదలు ఎక్కడా ఇబ్బంది పడకుండా ప్రతి సోమవారం డబ్బులు విడుదల చేస్తున్నామని అన్నారు. పేదల పక్షపాతిగా ఉన్న ప్రజా ప్రభుత్వం ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు వచ్చినా భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబ్, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల ప్రాణ త్యాగాలు వెలకట్టలేనివి- బెల్లంపల్లి ఏసిపి రవి కుమార్



మందమర్రి/ చెన్నూర్ అక్టోబర్ 21 అక్షర కలం ప్రతినిధి:-

శాంతి భద్రతల పరిరక్షణకై తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, బెల్లంపల్లి ఏసిపి రవి కుమార్ కొనియాడారు. మందమర్రి పోలీస్ స్టేషన్ ఆవరణలోని అమరవీరుల స్తూపం వద్ద మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినం (ఫ్లాగ్ డే)ను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏసిపి రవి కుమార్ పోలీస్ అధికారులతో కలసి అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సాయుధ పోలీసులు శోక్ శ్రస్త్ నిర్వహించి, పోలీస్ అధికారులు, సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఏసిపి రవి కుమార్ మాట్లాడుతూ..పోలీసు అమరవీరుల త్యాగఫలం వల్లే గతం కంటే ప్రస్తుత పరిస్థితి మెరుగ్గా ఉందని, వారి త్యాగనిరతిని నిరంతరం మననం చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.అమరవీరులు అందించిన స్ఫూర్తితోనే ప్రజల భద్రత, రక్షణ చర్యల్లో భాగంగా శాంతి భద్రతల పరిరక్షణకు ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. దేశ సరిహద్దుల్లోని ఆక్సాయ్ చిన్ ప్రాంతంలో పహారా కాస్తున్న 10 మంది సిఆర్పిఎఫ్ పోలీసులను 1959లో ఇదే రోజున చైనా సైనికులు హతమార్చారని, వారి త్యాగాలను స్మరిస్తూ అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినం జరుపుకుంటున్నామని వివరించారు.విధి నిర్వహణలో ఎన్నో జటిలమైన సవాళ్లు ఎదురవుతున్నా, వాటిని అధిగమిస్తూ ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. అమరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత అన్ని వర్గాల ప్రజలపై ఉందని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి, బెల్లంపల్లి రూరల్ సిఐ హనుక్, బెల్లంపల్లి టౌన్ సిఐ శ్రీనివాస్, తాండూరు సిఐ దేవయ్య, సబ్ డివిజన్ ఎస్సైలు, మందమర్రి సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంపీ వద్దిరాజును ఆహ్వానించిన శ్రీకృష్ణదేవరాయ కాపు సేవాసమితి ప్రముఖులు

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను శ్రీకృష్ణదేవరాయ కాపు సేవాసమితి ప్రముఖులు ఎన్.నరేంద్ర బాబు,వై.మల్లికార్జున రావు,వై.ప్రవీణ్ కుమార్,నీ.నాగ మోహనరావులు మంగళవారం కలిసి తాము జరిపే వనభోజన మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కావలసిందిగా కోరారు.కార్తీక మాసం సందర్భంగా బీహెచ్ఇఎల్ జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 26వతేదీన సేవాసమితి ఆధ్వర్యాన 59వ వనభోజన మహోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని ఎంపీ రవిచంద్రకు వారు వివరించారు.ఈ మహోత్సవానికి పటాన్ చెరు, శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలు,ఆ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న కాపులు,బలిజలు,మున్నూరు కాపులు,ఒంటరి,తెలగ, తూర్పు కాపులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని తెలిపారు.



# పంచాక్షరి అన్నదాన సేవా సమితికి ఏడు వసంతాలు

## ప్రతి అమావాస్యకు అన్నదానం...



అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

'అన్నదానం అన్ని దానాల కంటే మిన్న' అనే నినాదంతో ప్రతి నెల అమావాస్య రోజున నిరుపేదలకు అన్నదానం చేస్తూ పంచాక్షరి అన్నదాన సేవా సమితి ఏడు వసంతాలు పూర్తి చేసుకుంది.2018 దీపావళి రోజున ఐదుగురు స్నేహితులు ఆకలితో ఉన్నవారికి భోజనం పెట్టాలనే సేవా దృక్పథంతో ఖమ్మం వైరా రోడ్ లో గల జలాంజనేయ స్వామి గుడి ముందర ప్రారంభించిన ఈ సమితి, నేటికీ సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తోంది. ం- కరోనా కాలంలో మానవత్వాన్ని చాటుకున్న పంచాక్షరి సభ్యులు... కోవిడ్ కాలంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో కోవిడ్ బాధితులకు, ఇతర రోగులకు ప్రతిరోజు అల్పాహారం అందించడం తో పాటు వెనుకబడిన కాలనీలలోని పేద కుటుంబాలకు, పేపర్ బాయ్స్‌కు గుడ్లు, నిత్యావసర సరుకులు, మాస్కులు పంపిణీ చేయడం జరిగింది.

### పంచాక్షరి ఆధ్వర్యంలో దుర్గా నవరాత్రులు...

2021 నుండి ప్రతి సంవత్సరం దుర్గానవరాత్రి వేళ కుంకుమపూజ, సరస్వతీ పూజ, అన్నవితరణ కార్యక్రమాలు, సద్దుల బతుకమ్మ వేడుకలను బోనకల్ రోడ్ జవ్వాజి రెసిడెన్సీ వద్ద అంగరంగ వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారు.

### -2023 లో సొసైటీ రిజిస్ట్రేషన్...

ఈ సేవా కార్యక్రమాలు నిరంతరంగా సాగుతుండడంతో సమితిని ఆగస్టు 28, 2023న 165/2003 నంబరుతో అధికారికంగా సొసైటీగా నమోదు చేశారు.

### పంచాక్షరి అన్నదాన సేవా సమితి సభ్యులు...

సమితి అధ్యక్షులుగా జవ్వాజి వీరాంజనేయులు, కోశాధికారులుగా తాటికొండ మల్లికార్జున్, గాయత్రి, జనరల్ సెక్రటరీగా చిలుకూరు ఉపేందర్, సభ్యులుగా పంతంగి శ్రీ కోటేశ్వరరావు, జంజీరాల శ్రీకాంత్, శ్రీజ, గుంటూరు నాగేశ్వరరావు, పడాల శ్రీనివాసరావు, జనార్ధన్ గుప్త, చుండూరు అజయ్, రమేష్, గుడిపూడి సుహాసిని, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# పారిశ్రామిక పెట్టుబడులకు అనుకూలం మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలు

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 21:

రాష్ట్రంలోని మంచిర్యాల పెద్దపల్లి జిల్లాలు పారిశ్రామిక పెట్టుబడుల కోసం అత్యంత అనుకూలమైన ప్రాంతాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. మంగళవారం రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావాలనే లక్ష్యంతో దుబాయిలో ప్రముఖ పెట్టుబడిదారులతో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో గనులు, ఇన్ఫ్రాస్ట్రక్చర్, విద్యుత్ ఉత్పత్తి, ఫుడ్ ప్రాసెసింగ్, ఎడ్యుకేషన్, హెల్త్ సెక్టార్ లో పెట్టుబడులు పెట్టేందుకు దుబాయ్ వ్యాపార వర్గాలను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో బొగ్గు, విద్యుత్, రైల్వే, రోడ్లు వంటి మౌలిక వసతులున్నాయని, ఈ ప్రాంతాల్లో పెట్టుబడి పెడితే వేలాదిమందికి ఉపాధి అవకాశాలు సృష్టించ వచ్చునని వివరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులతో సహకారం కొనసాగిస్తామని తెలిపారు.



## పేకాట రాయుళ్లపై టాస్క్ ఫోర్స్ పోలీస్ దాడులు..

ఎనిమిది మంది అరెస్టు..



మెదక్ అక్టోబర్ 21 (అక్షర కలం):-

మెదక్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, విశ్వసనీయమైన సమాచారం ఆధారంగా మెదక్ జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు చేగుంట గ్రామం పరిధిలో పేకాట ఆడుతున్న వ్యక్తులపై దాడి నిర్వహించారు. ఈ దాడిలో మొత్తం 8 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి రూ.58,060/- నగదు మరియు 7 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మరియు స్వాధీనం చేసిన వస్తువులను చేగుంట పోలీస్ స్టేషన్‌కు అప్పగించి, కేసు నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, మాట్లాడుతూ, జూదం వంటి అక్రమ కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి తెలిపారు.

## మెడికల్ సీటు సాధించిన విద్యార్థిని సాయిదీపికకు సన్మానం



అక్షర కలం, ఆమనగల్లు :

ఆమనగల్లు పట్టణ కేంద్రానికి చెందిన పెరికేటి సుజాత యాదయ్య దంపతుల కుమార్తె సాయిదీపిక మహబూబ్ నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన సందర్భంగా మంగళవారం నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్వర్యంలో ఘన సన్మానం చేసి స్వీటు తినిపించి వినాయకుడి చిత్రపటాన్ని బహుకరించారు. చిన్నప్పటి నుండి చదువులలో చురుకుగా ఉంటూ అన్ని స్థాయిలో పరీక్షలో రాణించినందుకు ఆమె ప్రతిభను కొనియాడారు. తల్లితండ్రులు పెరికేటి సుజాత యాదయ్య అభినందించి కులవృత్తిపై ఆధారపడి పిల్లలను చదివించడం ఆదర్శనీయమని చెప్పారు. కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కానుగుల దశరథం, ఆమనగల్లు మండల అధ్యక్షుడు కానుగుల గణేష్, పట్టణ అధ్యక్షుడు దేవరకొండ రమేష్, ప్రధాన కార్యదర్శి గుద్దేటి బాలు, దేవరకొండ నాగేష్, పెరికోటి కోటీ తదితరులు ఉన్నారు.

## కాలనీ సమస్యలు పరిష్కరించండి



అక్షర కలం, ఆమనగల్లు :

ఆమనగల్లు పట్టణంలోని 9వ వార్డులో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ కు కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కాలనీలో వీధిలైట్లు వెలగక ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. వర్షాలతో అంతర్గత మురుగు కాలువలు నిండి, రోడ్లపై మురుగు పారుతోందన్నారు. దీంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కమిషనర్ కు అందజేయడం జరిగింది. వినతి పత్రం అందజేసిన వారిలో ఉదయ్ కిరణ్,వర్కల వంశీ,అరుణ్, చత్రపతి అశోక్, ,శేఖర్ ఉన్నారు.

## అండర్ 14 కబడ్డీ నేషనల్ కు ఎంపిక అయిన విద్యార్థి జి. వికాస్ కి అభినందించిన మరికల్ గ్రామస్తులు .

అక్షర కలం / నారాయణపేట జిల్లా ప్రతినిధి : అక్టోబర్- 21.

నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రానికి చెందిన జి.వికాస్, తండ్రి జి. చెన్నయ్య, అనే విద్యార్థి అండర్ 14 కబడ్డీ నేషనల్ సెలెక్ట్ కావడంతో మరికల్ గ్రామ యువకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్తులు సోమవారం విద్యార్థికి అభినందించారు. జి. వికాస్ కబడ్డీ పోటీలలో నేషనల్ స్థాయిలో గుర్తింపు పొందినందుకు తల్లిదండ్రులు అయినా జి. చెన్నయ్య, రాజేశ్వరి లకు గ్రామస్తులు అభినందించారు. జి. వికాస్ రాబోయే రోజుల్లో క్రీడల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని మరికల్ మండల యువజన సంఘాలు, గ్రామ సంఘాలు గ్రామస్తులు కోరారు.



# పోలీసులు ప్రజా రక్షణే ద్యేయంగా పని చేయడం గొప్ప విషయం

వారి త్యాగాలు మరువలేనివి

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఈ నెల 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్

అక్షరకలం నల్గొండ





ప్రజల రక్షణే ద్యేయంగా పోలీసులు పని చేయడం చాలా గొప్ప విషయం అని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్, అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించి కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ శాఖ దేశంలోనే శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజా రక్షణకు విది నిర్వహణలో తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారని అన్నారు. ప్రాణ త్యాగాలతో పాటు ఎటువంటి సెలవులు లేకుండా ప్రజల రక్షణే ద్యేయంగా పని చేయడం చాలా గొప్ప విషయం అని కొనియాడారు. ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా ఎందరో అమరులయ్యారని వారి త్యాగాలు మరవలేనివి అన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన అనుమతులు ఇవ్వడం జరిగిందనీ, ఇప్పటి వరకు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ నాలుగు ఖాళీలను గుర్తించడం జరిగిందని తెలిపారు. పోలీస్ అమరవీరుల స్మృతి ఎల్లప్పుడు గుర్తు చేసుకుంటూ వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ జిల్లా ప్రభుత్వ యంత్రాంగం అండగా ఉంటుందని తెలిపారు. జిల్లా యస్పి శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శాంతి భద్రతల పరిరక్షణకు విది నిర్వహణలో ఎంతో మంది అమరులవుతున్నారనీ, వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ అక్టోబర్ 21 అమరవీరుల స్మారక దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ సంవత్సరం దేశ వ్యాప్తంగా విది నిర్వహణలో సంఘ విద్రోహ శక్తులతో పోరాడి 191 మంది పోలీసులు అమరులైనారనీ, వారిలో మన తెలంగాణ రాష్ట్రంలో ఐదుగురు ఉన్నారని తెలిపారు. ఎందరో పోలీస్ సిబ్బంది తమ అమూల్యమైన ప్రాణాలను లెక్కచేయకుండా విధి నిర్వాహణలో వారి ప్రాణాలను త్యాగం చేయడం జరిగిందని అన్నారు. వారి త్యాగం వలనే నేడు శాంతియుత వాతవరణం నెలకొన్నదని, ప్రజలు కూడా శాంతి యుతంగా ఉంటున్నారని, వారి త్యాగాలు మరవలేనివని పేర్కొన్నారు. పోలీసులు శాంతి భద్రత పరిరక్షణ లో నిత్యం పోరాటం చేస్తున్నారని, మన జిల్లా లో ఇప్పటి వరకు 15 మంది విది నిర్వహణ అమరులైనారని అమరవీరులైన కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది అని అన్నారు. ఈ పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ను పురస్కరించుకొని జిల్లా లోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిదిలో నేటి నుండి ఈ నెల 31వ తేది వరకు వివిధ కార్యక్రమాలు పోలీస్ ఓపెన్ హౌస్, మెగా రక్తదాన శిబిరాలు, షార్ట్ ఫిలిం, ఫోటోగ్రఫీ పోటీలు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, సైకిల్ ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అమిత్ నారాయణ, అడిషనల్ ఎస్పి రమేష్, యస్.బి డీఎస్పీ మల్లారెడ్డి, నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి, ఏ.ఆర్ డిఎస్పీ శ్రీనివాసులు, సిఐలు రాఘవ రావు, రాము, మహా లక్ష్మయ్య, రాజశేఖర్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, శ్రీను నాయక్ ,సురేష్, చంద్ర శేఖర్ రెడ్డి, ఆర్ఐ లు సంతోష్, శ్రీను, హరిబాబు, సూరప్ప నాయుడు, నరసింహ ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజు, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# నిబంధనలను పాటించకపోతే కఠిన చర్యలు



ఉమ్మడి నల్గొండ జిల్లా జోనల్ అధికారిని జ్యోతిర్మయి

స్వీట్ షాపుల్లో స్పెషల్ డ్రైవ్

17 స్వీట్ షాప్, స్పైసెస్



దుకాణదారులకు నోటీసులు

అక్షరకలం నల్గొండ

వ్యాపారస్తులు ఫుడ్ సేఫ్టీ నిబంధనలను విధిగా పాటించాలని లేనిపక్షంలో కఠి చర్యలు తీసుకుంటామని ఉమ్మడి నల్గొండ జిల్లా జోనల్ అధికారిని వీ. జ్యోతిర్మయి హెచ్చరించారు. రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాల మేరకు ఉమ్మడి నల్గొండ జిల్లా జోనల్ అధికారిని వి. జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఉమ్మడి నల్గొండ జిల్లాల్లో ఆహార భద్రత శాఖ అధికారులు శనివారం స్వీట్స్ షాపులు స్పైసెస్ తయారీ కేంద్రాలు, రీటైల్ యూనిట్స్ లలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తనిఖీలలో భాగంగా 12 స్వీట్స్ తయారీ కేంద్రాలలో, 7 స్పైసెస్ తయారీ, రిటైల్ కేంద్రాలలో మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ను ఉపయోగించి స్పాట్ టెస్ట్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా వంట గదుల్లో పూర్తిగా అపరిశుభ్ర వాతావరణంలో స్వీట్ల తయారీ జరగడం పసుపు, కారం, మసాలాపొడులను ప్రాసెస్ చేయడం, ఫుడ్ హ్యాండ్లర్స్ హెయిర్ క్యాప్స్, గ్లౌజులు ధరించకపోవడం, పురుగులతో నాణ్యత లోపించిన ముడి సరుకులు ఉపయోగించడం, గోడలు, పైకప్పు పై నూనెతో కూడినటువంటి దుమ్ము ధూళి పేరుకు పోవడం వంటివి గుర్తించి వారికి ఫుడ్ సేఫ్టీ నిబంధనలను ఉల్లంఘించినందుకుగాను 17 స్వీట్ షాప్, స్పైసెస్ దుకాణదారులకు నోటీసులు జారీ చేశారు. హానికర రసాయనాలతో కూడిన రంగులతో చేసినటువంటి సుమారు 48 కిలోల స్వీట్లు, తయారీలో కాలం చెల్లిన ఆహార పదార్థాలను,5 కిలోల పురుగులు పట్టిన ధనియా పొడిని, ప్రజల ఆరోగ్య నిమిత్తం అక్కడికక్కడే ధ్వంసం చేయడం జరిగింది. సుమారు 90 కిలోల లేబుల్ లేనటువంటి ఆహార పదార్థాలను, 50 కిలోల పురుగులతో కూడిన మైదా పిండిని సీజ్ చేసి, 27 అనుమానిత శాంపిల్స్ ను పరీక్ష నిమిత్తం ల్యాబ్ కు పంపడం జరిగింది. నివేదిక ఆధారంగా ఆహార కల్తీ అని నిర్ధారణ అయితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆహార కల్తీ కి పాల్పడిన వారు ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, తరచూ ఇలాంటి స్పెషల్ డ్రైవ్స్ నిర్వహించబడతాయని, వ్యాపారస్తులు అప్రమత్తమై ఫుడ్ సేఫ్టీ నిబంధనలను పాటించాలని సూచించారు. లేదంటే చట్టపర చర్యలు తప్పవని హెచ్చరించారు.

## "తెలంగాణ రైజింగ్ - 2047 " సిటిజన్ సర్వే లో పాల్గొన్న 3 లక్షల మంది

ఈనెల 25 తో ముగియనున్న సర్వే

హైదరాబాద్, అక్టోబర్ 21 : అక్షర కలం ప్రతినిధి:

తెలంగాణా రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన "తెలంగాణ రైజింగ్ – 2047 " సిటిజన్ సర్వే కు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు ఈ సిటిజన్ సర్వే లో కేవలం తెలంగాణ నుండే వివిధ ప్రాంతాల నుండి దాదాపు మూడు లక్షలకు పైగా పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందచేశారు. భారత దేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్ – 2047 " సిటిజన్ సర్వేను చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25 వతేదీ తో ముగుస్తుంది. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉన్నందున అనే వెబ్సైట్ లో సందర్శించి ప్రతీ ఒక్కరు తమ సలహాలు సూచనలను అందించాల్సింగా ఒక అధికార ప్రకటనలో తెలియ చేశారు

## పలు సమస్యలపై పంచాయతీ ఈవో కి వినతి పత్రం..ముర్ల రమేష్

అక్షర కలం భద్రాచలం

భద్రాచలం గ్రామపంచాయతి పరిధిలో నెలకొని ఉన్న మౌళిక సదుపాయాలు ఐన రోడ్లు , డ్రైన్ , వీది దీపాలు , అంతర్గత రోడ్ల మరమ్మత్తుల సమస్యలను చర్చించి , పరిష్కరించుటకు గ్రామ సభ నిర్వహించాలని గ్రామపంచాయతి కార్యనిర్వహణ అధికారి ఈఓ కి ఆదివాసి కొండరెడ్ల సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు ముర్ల రమేష్ వినతిపత్రం అందించటం జరిగింది దీనికి స్పందించిన ఈవో వెంటనే సమస్యలు పరిష్కారానికి మార్గం చూపుతానని హామీ ఇవ్వడం జరిగినది.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955